





www.vibharenews.com

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY

PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి గురువారం 24-11-2022 సంపుటి : 04 సంచిక :83 పేజీలు : 4 వెల : రూ 3-00


### అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి

## హైకోర్టు గ్రీన్‌సిగ్నల్




అమరావతి: అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పోస్టులకు సంబంధించి శుభవార్త. పోస్టుల భర్తీకి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు బుధవారం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.అంగన్‌వాడీ పోస్టుల భర్తీపై దాఖలైన పిటిషన్‌పై హైకోర్టులో విచారణ జరిగిన సంగతి తెలిసిందే.మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖలో అంగన్‌వాడీ వర్కర్లకు విస్తరణ అధికారులుగా పదోన్నతి ఇవ్వడంపై ఆంధ్రప్రదేశ్ హైకోర్టు స్టే విధించింది. ఈ నేపథ్యంలో.. బుధవారం విచారణ కొనసాగగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పోస్టుల భర్తీపై స్టే ఎత్తివేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది ఏపీ హైకోర్టు. ఇదిలా ఉంటే.. అంగన్‌వాడీ కేంద్రాల్లో 560 ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ (ఈఓ) పోస్టుల భర్తీకి ఆమధ్య ఏపీ ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది.అంగన్‌వాడీ సూపర్‌వైజర్(గ్రేడ్-2) పోస్టుల భర్తీ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించినట్లు, తప్పుడు ప్రచారాలను నమ్మొద్దంటూ రాష్ట్ర మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ గతంలోనే స్పష్టత ఇచ్చింది.

## విద్యార్థులూ అలర్ట్..

### త్వరలోనే జేఈఈ మెయిన్ నోటిఫికేషన్!



దేశంలోని ప్రఖ్యాత విద్యా సంస్థల్లో ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే జేఈఈ మెయిన్ పరీక్షకు తేదీల కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులకు అలర్ట్.వచ్చే వారం లోపే దీనికి సంబందించిన నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉన్నట్టు సమాచారం. జేఈఈ మెయిన్ 2023 నోటిఫికేషన్ ఈ వారంలో విడుదల చేసే అవకాశంలేదని, వచ్చే వారంలో ఆగస్టు 30నాటికి పరీక్ష తేదీలు వెల్లడించే అవకాశం ఉందని సంబంధిత అధికారులు పేర్కొన్నట్టు వార్తలు వస్తున్నాయి. అలాగే, జేఈఈ మెయిన్ 2023 తొలి విడత జనవరిలో, రెండో విడత ఏప్రిల్‌లో నిర్వహించే అవకాశం ఉంది. ఒకవేళ నవంబర్ 30లోగా నోటిఫికేషన్ వస్తే తొలి విడత పరీక్షకు వెనువెంటనే రిజిస్ట్రేషన్ ప్రక్రియను మొదలుకానుంది. అయితే, ఈ పరీక్షకు సంబంధించి ఇటీవల ఓ ఫేక్ నోట్ సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేసిన నేపథ్యంలో అప్‌డేట్స్ కోసం ఎప్పటికప్పుడు వెబ్‌సైట్‌లో చెక్ చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.మరోవైపు, జేఈఈ మెయిన్ తొలి విడత పరీక్ష జనవరిలో జరుగుతుందన్న వార్తలపై పలువురు విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జనవరిలో నిర్వహించొద్దంటూ సామాజిక మాధ్యమాల వేదికగా ఎన్‌టీఏ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. తొలి విడత జేఈఈ మెయిన్ 2023 పరీక్షను ఏప్రిల్‌లో నిర్వహించాలని కోరుతూ ట్వీట్లు చేస్తున్నారు. జనవరి-ఫిబ్రవరిలో ఇతర పరీక్షలు ఉన్నందున రివిజన్‌కు సమయం కుదరదని పేర్కొంటున్నారు. అలాగే, 12వ తరగతి సిలబస్ కూడా ఇంకా పూర్తి కాలేదని, విద్యార్థుల పరిస్థితిని అర్థం చేసుకోవాలంటూ చఏవవఏజీతినిబతినిజీజూతీతిశ్రీ పేరిట హ్యాష్‌టాగ్‌తో ట్విటర్ వేదికగా కోరుతున్నారు. దీంతో పాటు ఈ ఏడాది అనేక బోర్డులు బోర్డు పరీక్ష ప్రాక్టికల్స్ కూడా జనవరిలోనే ప్రారంభిస్తున్నాయి. గతేడాది తొలి విడత జూన్ 20- 29 తేదీల మధ్య జరగ్గా.. రెండో సెషన్ పరీక్షను జులై 21- 30 తేదీల మధ్య నిర్వహించారు.

## సీఎం పర్యటనలో పరదాలు కడుతున్నారు

విశాఖపట్నం నర్సీపట్నంలో లోకేష్ పర్యటన సమయంలో అన్యాయంగా కేసులు పెట్టారు. అన్యాయంగా చాలా మంది యువకులు మీద కేసు పెట్టారు. ఆ మనస్థాపంతో వై సంతోష్ అనే యువకుడు ఆత్మహత్య ప్రయత్నం చేసాడు. ఆ యువకుడు రెండు ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స చేయించారు. ఆ సమయంలో నర్సీపట్నం ఏఎస్పీ నిశాంత్ రెడ్డి అక్రమంగా కేస్ పెట్టారు..ఆయన మీద బాధితుడి తల్లి హెచ్ ఆర్ సి కి ఫిర్యాదు చేసిందదని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. ఫిర్యాదు పై విచారణ చేసి కమిషన్ బాధితుడి కి ప్రాథమికంగా రెండు లక్షలు ఆర్థిక సాయం ఇవ్వాలని ఆదేశించారు. అదే పోలీసు అధికారి ఇప్పుడు చిత్తూరు జిల్లా ఎస్పీ గా ఉండి కుప్పం లో చంద్రబాబు ను కూడా ఇబ్బంది పెట్టారు. . సీఐడీ అధికారి సునీల్ కుమార్ నాయక్. బీహార్ లో మంచి అధికారిగా పెరుపొందారు. కానీ ఇక్కడ అధికారులకు దాసోహం అంటున్నారు. సిద్దార్థ కౌశల్ గుడివాడ ఎస్పీ గా ఉన్నపుడు క్యాసినో జరిగితే ఏం చేశారు. పోలీస్ అధికారులు చట్ట పరిధిలో పనిచేయాలి. నర్సీపట్నంలో నిశాంత్ రెడ్డి పై కేస్ నమోదు చేసాం.

# ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించే లక్ష్యం

### ఆస్తిపై అభద్రత ఉండకుండా పక్కాలెక్క
### వివాదాలకు తావ్వలేకుండా భూముల సర్వే
### అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రీ సర్వే
### జగనన్న శాశ్వత భూహక్కు- భూరక్షలో సిఎం జగన్
### చంద్రబాబు తీరుపై ఘాటు విమర్శలు

శ్రీకాకుళం,నవంబర్23 : ప్రజల ఆస్తులకు రక్షణ, భరోసా కల్పించటమే భూ సర్వే ఉద్దేశ్యమని సీఎం జగన్ స్పష్టం చేశారు. ప్రజలకు తమ ఆస్తిపై అభద్రతా భావం ఉండకూడదన్నారు. గతంలో ఎన్నడూ జరగని విధంగా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రీ సర్వే చేపట్టామని చెప్పారు. ఇందుకోసం రూ.1000 కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. మ్యుటేషన్, ల్యాండ్ సబ్ డివిజన్, హక్కు పత్రాలు సులభతరం అవుతాయన్నారు. రిజిస్ట్రేషన్లు స్థానిక సచివాలయాల్లోనే జరుగుతాయని సీఎం జగన్ పేర్కొన్నారు. శ్రీకాకుళం జిల్లాలోని నరసన్నపేటలో 'జగనన్న శాశ్వత భూహక్కు- భూరక్ష'కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి బుధవారం ఉదయం ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎంమాట్లాడుతూ... వైస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు ప్రారంభించటం ఆనందంగా ఉందన్నారు. డిసెంబరు 2023 నాటికి 5 విడతల్లో భూహక్కు పూర్తి చేసి హక్కు పత్రాలు ఇస్తామని తెలిపారు. భూముల విలువలు పెరగటంతో అక్రమాలు పెరిగిపోయాయన్నారు. భూ రికార్డులు సరిగా లేక పోవటంతో ప్రజలు పడుతున్న అగచాట్లు పాదయాత్రలో చూశానని ముఖ్యమంత్రి తెలిపారు.90 శాతం భూ వివాదాల కేసులు ఉన్నాయన్నారు. సరైన వ్యవస్థ లేకపోవటం వల్ల రికార్డులు ట్యాంపరింగ్ జరిగేవని చెప్పుకొచ్చారు. బుధవారం ఉదయం నరసన్నపేటలోని సభా వేదిక వద్దకు చేరుకున్న సిఎం ముందుగా సర్వే స్టాల్స్‌ను పరిశీలించారు. అధికారులతో వివరాలడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష (రీ సర్వే) పత్రాల పంపిణీని ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. ఆధునిక డిజిటల్ రెవెన్యూ రికార్డులు సిద్ధమైన గ్రామాల్లో రైతులకు భూ హక్కు పత్రాల పంపిణీ జరగనుంది. జ్యోతి ప్రజ్వలన చేసి ముఖ్యమంత్రి జగన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సభలో సిఎం జగన్ మాట్లాడుతూ ... భూ సర్వే రికార్డుల



ప్రక్షాళన అనే గొప్ప కార్యక్రమం రెండేళ్ల కిందట మొదలైందని, రైతులందరికీ వారి భూ హక్కు పత్రాలు అందిస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. 2 వేల రెవెన్యూ గ్రామాల్లో భూ రికార్డుల ప్రక్షాళన జరుగుతుందని హర్షాన్ని వ్యక్తం చేశారు. 7,92,238 మంది రైతులకు భూ హక్కు పత్రాలు అందనున్నాయన్నారు. ఫిబ్రవరిలో రెండో దశలో 4 వేల గ్రామాల్లో సర్వే జరుగుతుందని తెలిపారు. మే 2023 నాటికి 6 వేల గ్రామాల్లో భూ హక్కు పత్రాలు అందుతాయని వివరించారు. ఆగస్ట్ 2023 నాటికి 9 వేల గ్రామాల్లో సర్వే పూర్తవుతుందని సిఎం జగన్ తెలిపారు. వచ్చే ఏడాది చివరి నాటికి రాష్ట్రమంతటా సమగ్ర సర్వే పూర్తి అవుతుందని అన్నారు. 80 శాతం నుంచి 90 శాతం సివిల్ కేసులు భూములకు సంబంధించినవేనన్నారు. రికార్డులు సరిగా లేకపోవడం, మ్యూటేషన్ సరిగా లేకపోవడం వల్ల సమస్యలు ఉన్నాయని, ఎలాంటి సివిల్ వివాదాలు తావుండకూడదని అడుగులు ముందుకేస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. అక్షాంశాలు, రేఖాంశాల ఆధారంగా ప్రతి కమతానికి నెంబర్ ఇస్తామని సిఎం జగన్ తెలిపారు. హద్దు రాళ్లు కూడా పాతి రైతులకు భూహక్కు పత్రం ఇవ్వబోతున్నామని ప్రకటించారు. సరైన వ్యవస్థ లేకపోవడం వల్ల రైతులు నష్టపోతున్నారని, ఆ పరిస్థితులు మార్చాలని అడుగులు ముందుకు వేస్తున్నా మన్నారు. భూ వివాదాలన్నింటికీ చెక్ పెడతామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అనంతరం టిడిపి అధ్యక్షుడు చంద్రబాబుపై జగన్ విమర్శలు చేశారు. తనకు తాను పార్టీ పెట్టుకుని అధికారంలోకి వస్తే ఎంజీఆర్.. ఎన్టీఆర్.. జగన్ అంటారనీ, కూతురునిచ్చిన మామ పార్టీని కబ్జా చేస్తే వాళ్లను చంద్రబాబు అంటారని సిఎం ఎద్దేవా చేశారు. ఎన్నికలప్పుడు ప్రజలకు మాయమాటలు చెప్పి మోసం చేసేది చంద్రబాబు అని, అలాంటి చంద్రబాబుకు వత్తాసు పలుకుతున్న దుష్టచతుష్టయాన్ని ఏమనాలి ? అని ప్రశ్నించారు. భార్యతో సంసారం చేసే వారిని శ్రీరాముడు అంటామని.. పరాయి మహిళను ఎత్తుకెళ్లే వాడిని రావణుడు అంటామని.. మరి సొంత మామను వెన్నుపోటు పొడిచి అధికారంలోకి వచ్చిన వారిని ఏమంటారని వ్యాఖ్యలు చేశారు.

## డిసెంబర్5న రాజకీయపార్టీలతో మోడీ భేటీ

### జి-20 దేశాల సదస్సు నిర్వహణపై సమాలోచనలు
### సమావేశంలో పాల్గొనాలని చంద్రబాబుకు ఆహ్వానం



అమరావతి,నవంబర్23 : డిసెంబర్ 5న రాష్ట్రపతి భవన్‌లో సాయంత్రం 5 గంటలకు ప్రధాని మఓడీ అధ్యక్షతన రాజకీయపార్టీల అధినేతల సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి దేశంలోని రాజకీయపార్టీల నేతలకు లేఖలు అందాయి. ఇందులో భాగంగా టీడీపీ అధినేత చంద్రబాబుకు కూడా కేంద్రం నుంచి పిలుపు వచ్చింది. ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగే దేశంలోని రాజకీయ పార్టీల అధ్యక్షుల సమావేశానికి హాజరుకావాల్సిందిగా కేంద్రం కోరింది. డిసెంబర్ 1, 2022 నుంచి నవంబర్ 30, 2023 వరకు జీ-20 దేశాల కూటమికి భారతదేశం అధ్యక్షత వహించనుంది. భారత్‌లో నిర్వహించే జీ -20 భాగస్వామ్య దేశాల సమావేశాలపై రాజకీయ పార్టీల అధ్యక్షులతో ప్రధాని మోడీ చర్చించి.. సలహాలు తీసుకోనున్నారు. ఈ సమావేశానికి హాజరుకావాల్సిందిగా పార్లమెంటరీ వ్యవహారాల శాఖమంత్రి ప్రహ్లాద్ జోషి. చంద్రబాబుకు ఆహ్వానం పంపారు. అలాగే సమావేశ ప్రాధాన్యతను కూడా టీడీపీ అధినేతకు ప్రహ్లాద్ జోషి ఫోన్‌లో వివరించి హాజరు కావాల్సిందిగా కోరారు. కేంద్ర ప్రభుత్వ ఆహ్వానం మేరకు మరొకసారి టీడీపీ అధినేత చంద్రబాబు డిసెంబర్ 5న ఢిల్లీకి వెళ్లనున్నారు. మోడీ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి హాజరు కానున్నారు. ఇటీవల జరిగిన ఆజాదీకా అమృత్ మహోత్సవ్ సమావేశానికి కూడా చంద్రబాబును కేంద్రం ఆహ్వానించింది. ఆ సమావేశంలో ప్రధాని మోడీ.. చంద్రబాబుతో ఐదు నిమిషాల పాటు ప్రత్యేకంగా చర్చించారు. 2019 ఎన్నికల తర్వాత వీరిద్దరూ కలవడంపై పొలిటికల్‌గా ఆసక్తి రేపింది. ఏయే అంశాలపై చర్చించుకున్నారన్నది దేశ రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. తాజాగా మరోసారి ప్రధాని సమావేశానికి చంద్రబాబు హాజరు కానుండటంతో ఈ అంశం ఉత్కంఠ రేపుతోంది.

## ప్రధాని తప్పు చేస్తే.. చర్యలు తీసుకునే సత్తా ఉన్న సీఈసీ కావాలి: సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ: దేశ ప్రధాన మంత్రిపై సైతం చర్యలు తీసుకునేంత సత్తా ఉన్న ప్రధాన ఎన్నికల కమిషనర్ ప్రస్తుతం మన దేశానికి అవసరమని దేశ సర్వోత్తమ న్యాయస్థానం అభిప్రాయపడింది.రాజకీయాలతో సంబంధం లేని వ్యక్తుల ఎంపిక సరైందంటూ అభిప్రాయపడింది సుప్రీం కోర్టు. కేంద్ర ఎన్నికల సంఘానికి సంబంధించి.. ఎన్నికల కమిషనర్ల నియామకానికి ప్రస్తుతం నడుస్తున్న వ్యవస్థ సరికాదని.. కొలీజియంలాంటి వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై సుప్రీం రాజ్యాంగ ధర్మాసనం విచారణ జరుపుతోంది. ఈ క్రమంలో.. బుధవారం విచారణ సందర్భంగా ఆసక్తికర వ్యాఖ్యలే చేసింది బెంచ్.ప్రధాన మంత్రికి వ్యతిరేకంగా చర్యలు తీసుకునే ప్రధాన ఎన్నికల కమిషనర్ మనకు అవసరం. ఉదాహరణకు.. ప్రధానికి వ్యతిరేకంగా ఆరోపణలు వచ్చాయనుకుందాం. ఆ సమయంలో సీఈసీ చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ఒకవేళ సీఈసీ గనుక బలహీనంగా ఉంటే ఎలాంటి చర్యలు తీసుకోలేరు కదా అని జస్టిస్ కె.ఎం.జోసెఫ్, జస్టిస్ అజయ్ రస్తోగి, జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ హృషీకేశ్ రాయ్, జస్టిస్ సి.టి.రవికుమార్‌లతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం పేర్కొంది.చీఫ్ ఎలక్షన్ కమిషనర్ అనే ఉన్నత స్థానం రాజకీయ ప్రభావం నుంచి రక్షించబడాలి. స్వతంత్రంగా ఉండాలి. కానీ, అలా జరగడం లేదు. ఇది పూర్తిగా వ్యవస్థ విచ్ఛిన్నం కాదా అని కేంద్రం తరపు న్యాయవాదిని ధర్మాసనం ప్రశ్నించింది. ఎన్నికల కమిషనర్ నియామకంలో అనుసరిస్తున్న యంత్రాంగాన్ని తమకు చూపాలని కేంద్రం తరపు న్యాయవాదిని ధర్మాసనం ప్రశ్నించింది. దీంతో ప్రభుత్వం తరపున వాదిస్తున్న అటార్నీ జనరల్ ఉ బృందం వివరణలు ఇచ్చుకుంది. కేంద్ర మంత్రివర్గం సలహా మేరకు ఎన్నికల కమిషనర్లను రాష్ట్రపతి నియమించాలని రాజ్యాంగంలో ఉందని, ఇంతవరకు అదే అమలవుతోందని ఏజీ ఆర్.వెంకటరమణి బెంచ్‌కు వివరించారు.అంతకు ముందు మంగళవారం వాదనల సందర్భంగా.. సుప్రీం కోర్టు ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. సున్నితంగా ఉండే ఎన్నికల సంఘం భుజాలపై అపారమైన అధికారాలను రాజ్యాంగం మోపిందని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. సర్వోత్తముడైన వ్యక్తిని ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా నియమించేలా ఓ వ్యవస్థను రూపొందించాలని కేంద్రానికి సూచించింది. ఈ క్రమంలో మాజీ సీఈసీ టీఎన్ శేషన్‌ను గుర్తు చేస్తూ.. అలాంటి గట్టి వ్యక్తి, సంస్కరణలు తీసుకొచ్చిన వ్యక్తి ఉండాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. సమర్థతే కాకుండా దృఢమైన వ్యక్తిత్వం ఉన్నవారిని సీఈసీగా నియమించేందుకు సరైన విధానం రూపొందించాలని అటార్నీ జనరల్ (ఏజీ) ఆర్.వెంకటరమణి కి సూచించింది.ఏజీ వివరణపై అసంతృప్తి వ్యక్తం చేసిన బెంచ్.. 2004 నుంచి ఒక్క సీఈసీ కూడా ఆరేళ్ల పదవీ కాలాన్ని పూర్తిచేయలేదని తెలిపింది. యూపీఏ, ఎన్డీయే హయాంలో సీఈసీలు మారిన విషయాన్ని గుర్తు చేసింది.

## బంగాళఖాతంలో వాయుగుండం

### అన్నదాతల్లో మొదలైన కలవరం
### వానలు పడితే ధాన్యం తడుస్తుందన్న ఆందోళన
### త్వరగా కొనుగోళ్లు చేపట్టాలని నిరసనలు

అమరావతి,నవంబర్23: నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం వల్ల రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం కొన్నిచోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. ఆకాశం మేఘావృతమై జల్లులు పడుతుండటంతో అన్నదాతలు కలవరపాటుకు గురవుతున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం దక్షిణాంధ్ర, తమిళనాడు, పుదుచ్చేరి మధ్య తీరం దాటే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం పేర్కొంది. దీని ప్రభావంతో దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమలో బుధవారం కొన్నిచోట్ల, ఉత్తర కోస్తాంధ్రలో ఒకటి రెండు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని ఐఎండి తెలిపింది. మరో వైపు రాష్ట్ర వ్యాప్తంగా కనిష్ట ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన వరిపంట కోతకు వచ్చిన దశలో వర్షం పడితే దిగుబడులు తగ్గే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఎండబెడుతున్న ధాన్యం తడిసి ముద్దవుతుందన్న భయం వెన్నాడుతోంది. వెంటనే ధాన్యం కొనుగోల్లు చేపట్టాలని కోరుతున్నారు. ఇకపోతే కోనసీమ జిల్లాలో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వాన పడింది. అమలాపురం, అంబాజీపేట, అయినవిల్లి, అల్లవరం మండలాల్లో భారీ వర్షం కురిసింది. కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాలో పలుచోట్ల తేలికపాటి జల్లులు పడ్డాయి. కాకినాడ జిల్లా ఉప్పాడలో సముద్రం అల్లకల్లోలంగా ఉంది. అన్నమయ్య జిల్లా మదనపల్లిలో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడ్డాయి. వర్షం కారణంగా ఈనెల 25న మదనపల్లిలో సిఎం పర్యటన వాయిదా పడిందని రాజంపేట ఎంపి మిథున్‌రెడ్డి, మదనపల్లి ఎమ్మెల్యే నవాజ్‌బాష తెలిపారు. తిరుమలలో ఆకాశం మేఘావృతమై జల్లులు పడ్డాయి. దట్టమైన పొగమంచు వ్యాపించింది. ఇదిలావుంటే కృష్ణాజిల్లాలో ధాన్యం రైతులు రోడ్డెక్కారు. కొనుగోలు సమయంలో తమకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ధాన్యం ట్రాక్టర్లతో సహా రోడ్డుపైకి వచ్చి నిరసన తెలిపారు. శాంపిల్స్ పరిశీలనలో ఆర్‌బికె సిబ్బంది ఒకరకంగా, మిల్లర్లు ఒకరకంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేసే తరుణంలో శాంపిల్స్ పరిశీలించి 25 శాతం తేమ ఉన్నట్లు నిర్ధారించి మిల్లర్లు వద్దకు పంపారని, మిల్లర్లు దానిని 27 శాతంగా నిర్ధారిస్తున్నారని తెలిపారు. తమ ధాన్యానికి ప్రభుత్వం కేటాయించిన ధరను అందించాలని, ఆర్‌బికెలు శాంపిల్స్‌లో నిర్ధారించిన శాతాన్నే మిల్లర్లూ నిర్ధారించాలని కోరారు. కొన్నిచోట్ల రైతులు రోడ్డుకు అడ్డంగా ట్రాక్టర్లు పెట్టి రాస్తారోకో చేయడంతో గుడివాడ - మచిలీపట్నం రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. వర్షాలు పడుతాయన్న భయం ఉందని త్వరగా కొనుగోళ్లు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.

# సంపాదకీయం

గురువారం 24-11-2022

## ప్రతి ముగ్గురిలో ఒకరికి పోషకాహార లోపం

భారత దేశంలో గత రెండు దశాబ్దాలుగా పేదరికం 21 శాతం తగ్గడం, శిశు మరణాలు సగానికి పైగా తగ్గడం, 80 శాతానికి పైగా గర్భిణుల ప్రసవాలు ఆసుపత్రుల్లో జరగడం, 2 మిలియన్ల పిల్లలు బడులకు దూరమైపోవడం వంటి విభిన్న వాస్తవాలు బయటపడ్డాయి. దీనికి తోడుగా నిన్నటి కొవిడ్– 19 కల్లోలం కారణంగా ఉద్భవించిన సామాజిక ఆర్థిక ప్రభావంతో అదనంగా 6.7 మిలియన్ల 5 ఏండ్ల లోపు బాలలు ప్రమాదకర పోషకాహార లోపంతో బాధపడుతున్నారని, సగానికి పైగా బాలల మరణాలు నమోదు అవుతున్నాయని 'యూనిసెఫ్ నివేదిక' కఠిన వాస్తవాలను వెల్లడించడం విచారకరం.ప్రతి ముగ్గురు బాలల్లో ఒక్కరు తీవ్ర పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. పోషకాహార లోపంతో బాధపడుతున్న బాలలకు కరోనా లాంటి అనేక అంటువ్యాధులు తొందరగా సోకుతాయని తెలుపుతున్నారు. కడు పేదరికం, పని దొరక్కపోవడం, ఆహార అభద్రత కారణాలు బాలల ఆరోగ్యంపై విషప్రభావాన్ని చూపిస్తున్నాయి. నేడు ఉక్రెయిన్ రష్యా యుద్ధం కొనసాగుతున్న సమయంలో అత్యవసర పోషకాహార సరఫరా వ్యవస్థలు దెబ్బతిని ధరలు పెరగడంతో బాలలు కనీస పోషకాహారానికి దూరం అవుతూ, తీవ్ర పోషకాహార లోప స్థితితో 38.4 శాతం బాలల శారీరక అభివృద్ధి ఆగిపోయిన కారణంగా వయసు కన్నా అతి తక్కువ ఎత్తుతో (స్టంటింగ్) పొట్టి వాళ్ళలా మారుతున్నారని కూడా గుర్తించారు.మన దేశంలో మగ శిశువుల కన్నా ఆడ శిశు మరణాలు ఎక్కువగా నమోదు కావడం బాధాకరం. దీని కారణంగా మగ ఆడ పిల్లల నిష్పత్తి 1000:900 ఉండడం ప్రకృతి విరుద్ధమని తెలుసుకోవాలి. ప్రపంచ వ్యాప్తంగా 5 ఏండ్ల లోపు మగ బాలలు 7 శాతం మరణిస్తే, ఇండియాలో 11 శాతం ఆడ బిడ్డలు మరణిస్తున్నారు. గ్రామీణ, పట్టణ మురికివాడలు, యస్సి, యస్టి, పేద కుటుంబాలకు చెందిన పిల్లల్లో పోషకాహార లోపం, ఆరోగ్య వసతుల లేమి, బాల్య వివాహాలు, పాఠశాలలకు పిల్లలు దూరమవడం, పరిసరాలతో పాటు వ్యక్తిగత అపరిశుభ్రత, సురక్షిత తాగునీరు లేకపోవడం లాంటి సమస్యలు చుట్టు ముట్టుతున్నాయి. దేశ కౌమారదశ (10 19 ఏండ్ల) పిల్లల జనాభా 253 మిలియన్లు ఉన్నారు.బాల్యవివాహాలు చేసుకున్న కూతుర్ల సంఖ్యలో ప్రపంచ దేశాల్లో భారత్ 4వ స్థానంలో ఉంది. వీరిలో అనారోగ్యం, చిన్నతనంలోనే తల్లి కావడం, పోషకాహారం అందకపోవడం, ఆర్థిక వెనుకబాటుతనం, బలహీన సంతానం ఉ ండటం వంటి సమస్యలు వెన్నాడుతాయి. కౌమారదశ బాలికల్లో 54 శాతం, బాలురలో 30 శాతం రక్తహీనతతో సతమతం అవుతున్నారు. మన దేశంలో 60– 90 శాతం బాలికలు ఏదో ఒక సందర్భంలో లైంగిక అత్యాచారాలు, హింసలు లేదా వేధింపులను అనుభవిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా 189 దేశాల మానవ అభివృద్ధి సూచిక జాబితాలో ఇండియా 130వ స్థానంలో ఉన్నది. భారత దేశ భాగ్య విధాతలుగా ఎదగాల్సిన బాలలు ఆహార కొరత, పోషకాహార లోపం, అనారోగ్యం, అవిద్య, బాలకార్మిక వ్యవస్థ, బాలల లైంగిక వేధింపులు, బాల్యవివాహాలు లాంటి తీవ్ర సమస్యలతో సంసారం చేస్తున్నారు.కరోనాకు ముందు ప్రపంచ వ్యాప్తంగా 47 మిలియన్ల బాలలు పోషకాహార (వేస్టింగ్) సమస్యలతో సహజీవనం చేస్తే, తదనంతర కరోనా విపత్తు తరువాత యుద్ధ కాలంలో వారి సంఖ్య 54 మిలియన్లకు చేరడం మె?దటిసారి ఈ మిలీనియంలో జరిగింది. కరోనా వ్యాప్తితో పేద దేశాలలోని పోషకాహార లోపంతో బాధపడుతున్న 5 సంవత్సరాల లోపు బాలల సంఖ్య 14.3 శాతం పెరిగిందని గుర్తించారు. దీని పర్యవసానంగా సగానికి పైగా బాలలు పోషకాహార లోపంతో మరణిస్తున్నారని అనుమానిస్తున్నారు. విశ్వవ్యాప్తంగా 250 మిలియన్ల బాలలకు విటమిన్ ఎ అందలేదని, దాదాపు 25 శాతం వరకు పోషకాహార లోపం పెరిగిందని తేల్చారు. వీటి ఫలితంగా 1.28 లక్షల అదనపు బాలల మరణాలు జరుగవచ్చని విశ్లేషించారు. గర్భిణిలకు అందవలసిన సమతుల పోషకాహారం అందకపోవడం కూడా పరిస్థితి తీవ్రతను మరింత జటిలం చేస్తుందని నివేదిక తెలుపుతోంది.బాలలకు జీవించడం, శారీరకంగా మానసికంగా ఎదగడం, వేధింపుల నుండి రక్షణ పొందడం, అభివృద్ధిలో పాలుపంచుకోవడమనేవి రాజ్యాంగ హక్కులని గుర్తించింది. ఆకలి, అకాల మరణాలు, అత్యాచారాలు, బాలకార్మిక దురాచారం, విద్య, పోషకాహారం లాంటి సవాళ్ళను దేశం సమర్థవంతంగా ఎదుర్కోవలసి ఉంది. బాలల్లో పోషకాహార లోపాల్ని గుర్తించి తగు చర్యలు తీసుకోవడం, పేద కుటుంబాలకు ఆహారాన్ని ఇంటి వద్దనే పంపిణి చేయడం, పాఠశాలల్లో సురక్షిత మధ్యాహ్న భోజనం కల్పించడం లాంటి అంశాలలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. యూనిసెఫ్ ప్రణాళిక ప్రకారం కొవిడ్ –19, యుద్ధాల ధాటిని తట్టుకుంటున్న విశ్వమానవాళి, ముఖ్యంగా ఐదేళ్లలోపు బాలలను రక్షించుకోవడానికి రెస్పాండ్ , రికవర్, రీ ఇమేజిన్ అనబడే త్రీ సుత్రాలను ప్రతిపాదించారు. సమస్య జటిలం కాక పూర్వమే తగు చర్యలు తీసుకోవడం, సమస్యలతో సతమతమవుతున్న వారిని రక్షించుకోవడం, బయట పడిన వారిని సంరక్షించుకోవడం అనే విషయాలకు కట్టుబడి బాలలను, తల్లులను ఆరోగ్యవంతులుగా చూసుకోవలసిన బాధ్యత మనందరి మీద ఉందని నమ్ముదాం. రేపటి తరాన్ని పువ్వుల్లో పెట్టుకొని పెంచుకుంటూ, ఆరోగ్యకర యువ భారతాన్ని నిర్మించుకుందాం.

# వస్తున్నారు... వెళ్తున్నారు

### పూర్తి కానీ ప్రాజెక్టులు

శ్రీకాకుళం, నవంబర్ 23, రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సిక్కోలు పర్యటనకు వచ్చారు.. వెళ్లారు...జగన్ హామీల సంగతి ఎలా ఉన్నా... అంతకుముందు రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా పనిచేసిన హయాంలో కొన్నింటిని చేపట్టినా అవి నేటికి పూర్తి కాలేదు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలోనైనా అవి పూర్తవుతాయని అంతా ఆశిస్తున్నారు. అయితే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడున్నరేళ్ళు అవుతున్నా ఒక్క పెండింగ్ ప్రాజెక్ట్ కూడా పూర్తికాకపోవడంతో జిల్లా వాసుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. శ్రీకాకుళం జిల్లాను సస్య శ్యామలం చేసేందుకు ఉద్దేశించిన వంశధార ప్రాజెక్ట్ ఫేజ్–2, స్టేజ్ –2 కూడా నేటికి పూర్తి కాలేదు. నిర్వాసితుల సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదు. రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ప్రాజెక్ట్ లలో చోటు కల్పించినప్పటికీ సంవత్సరాలు గడుస్తున్నా పనులు ముందుకు సాగకపోవడం జిల్లా వాసులు జీర్ణించుకోలేక పోతున్నారు. అదేవిధంగా నేరడి బ్యారేజ్ కి ట్రిబ్యునల్ గ్రీన్ సిగ్నెల్ ఇచ్చిన తర్వాత స్వయంగా ముఖ్యమంత్రి ఒడిశా సిఎంతో చర్చలు జరపడంతో కొత్త ఆశలు రేకెత్తాయి. అయితే తర్వాత డిపిఆర్ లు సిద్ధం చేసినా ప్రాజెక్ట్ నిర్మాణంపై కదలిక మాత్రం రాలేదు. తాజాగా గొట్టా వద్ద ఎత్తిపోతల పథకాన్ని నిర్మించేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గ్రీన్ సిగ్నల్ఇవ్వడంతో పాటు పరిపాలన పరమైన అనుమతులు జారీ చేసి నిధులు మంజూరు చేసారు. అయితే ఆ పనులు సంగతేంటన్నది ఇంకా స్పష్టత రాలేదు. వచ్చే ఖరీఫ్ నాటికి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి శివారు ప్రాంతాలకి వంశధార నీటిని అందజేస్తామని జిల్లా మంత్రులు వివిద సందర్భాలలో చెబుతూ వస్తున్నారు. కాకపోతే ఇంకా టెండర్లు దశలోనే ఆ ఎత్తిపోతల పథకం ఉండడంతో నిజంగా అనుకున్న సమయానికి అది పూర్తవుతుందా అన్న సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. గతంలో సిఎం పలాస, నరసన్నపేట ,శ్రీకాకుళంలలో పర్యటించిన సందర్భంలో ఇచ్చిన హామీలు కూడా ముందుకు సాగలేదు. ఈ నేపథ్యంలో అధికార పార్టీ నాయకులతో పాటు ప్రతిపక్ష నేతలు, ప్రజా సంఘాలలో ను, ప్రజలలో అవన్నీ ఇప్పుడు ఆయా హామీలపై చర్చించుకుంటున్నారు. టెక్కలి, పలాస నియోజకవర్గ ప్రజల త్రాగు, సాగునీటి అవసరాలకు ఉద్దేశించిన ఆఫ్ షోర్ ప్రోజెక్ట్ పరిస్థితి కూడా ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా తయారైంది. తాజాగా సవరించిన అంచనాల మేరకు నిధులు మంజూరు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. ఈ ప్రాజెక్ట్ ఎప్పటికి పూర్తవుతుందోననేది ఖచ్చితంగా చెప్పే పరిస్థితి లేకుండా పోయింది. ఉ ద్దానం ప్రాంత వాసులకి సురక్షితమైన త్రాగునీరు అందించేందుకు ఉద్దేశించిన పథకం పనులతో పాటు కిడ్నీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులు ముందుకు సాగుతున్నా అవి ప్రజలకి ఎప్పుడు అందుబాటులోకి వస్తాయోనని ఆ ప్రాంత వాసులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.జిల్లా కేంద్రమైన శ్రీకాకుళంలో కోడిరామ్మూర్తి స్టేడియంతో పాటు ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. వాటిని జిల్లాకి చెందిన మంత్రులు సిఎం దృష్టికి తీసుకువెళ్లగా ఆయన శ్రీకాకుళం పర్యటన సమయంలో జగన్మోహన్ రెడ్డి స్పష్టమైన హామీలను ఇచ్చారు. కొడిరామ్మూర్తి స్టేడియం నిర్మాణం కోసం 10 కోట్లు మంజూరు చేసినట్లుగా ప్రకటించినా నేటికి అవి అక్కరకు రాకపోవడంతో పనులు ముందుకు సాగలేదు. జిల్లాలోని ఏకైక కోడిరామ్మూర్తి స్టేడియంని పూర్తి చేయాలన్న డిమాండ్ నెరవేర్చడంలోను ప్రభుత్వ నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లుగా కన్పిస్తోంది. ఇక ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ నిర్మాణానికి కూడా నిధులు కొరత వెంటా డుతుండడంతో ముందుకు సాగలేదు. దాని నిర్మాణానికి సిఎం హామీనిచ్చినా ఎప్పటికి అందుబాటులోకి వస్తుందో కూడా చెప్పలేనిపరిస్థితి నెలకొంది.అదేవిదంగా శ్రీకాకుళం – ఆమదాలవలస రహదారి విస్తరణకి నిధులు మంజూరైనా, భూసేకరణ, నిర్వాసి తులకు అందజేయాల్సిన నష్టపరిహారాలను చెల్లించేందుకు 18 కోట్లు మంజూరు చేస్తున్నట్లుగా సిఎం గతంలో ప్రకటించారు. అయితే ఈ రోజుకి నిధులు జమకాకపోవడంతో పనులు అరకొరగానే నడుస్తున్నాయి. నరసన్నపేట నియోజకవర్గంలోని ప్రధానమైన బొంతు ఎత్తిపోతల పథకానికి నిధుల సమస్య వెంటాడుతుంది. శంకుస్థాపన చేసి సంవత్సరాలు గడుస్తున్నా పనులు మాత్రం ఎక్కిరిస్తున్నాయి. పలుమార్లు ప్రభుత్వం దృష్టికి స్వయంగా స్థానిక ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ తీసుకువెళ్లినా ఫలితం లేకుండా పోయింది. నరసన్నపేట మెయిన్ రోడ్డు విస్తరణ పనుల పరిస్థితి కూడా అలాగే తయారైంది. సుమారు 4 కోట్లు అదనంగా అవసరం కాగా వాటిపై స్పష్టత రావడం లేదు. దీంతో నరసన్నపేట వాసులు పడరాని పాట్లు పడుతున్నారు. రానున్న సంక్రాంతి సమయానికి పనులు పూర్తి చేసేలా చూడాలని వ్యాపారులు కోరుతున్నారు.అలాగే సుదీర్ఘ తీర ప్రాంతం కలిగిన శ్రీకాకుళం జిల్లాలో మత్స్యకారుల సమస్యలు పరిష్కరించే నాధుడే కరువ య్యారన్న ఆవేదన వారిని వెంటాడుతు ంది. భావనపాడు పోర్టును పూర్తిగా మత్స్యకారులు వ్యతిరేకిస్తున్నారు. ను నిర్మించాలని డిమాండ్ చేస్తున్నారు. బుడగట్లపాలెం ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి అనుమతులు మంజూరు చేసి స్వయాన శంకుస్థాపన చేసినా నేటికి పనులు ప్రారంభం కాలేదు. మంచినీ ళ్ళపేటది కూడా అదే పరిస్థితి. ఇవి కాకుండా జిల్లాలో అనేక సమస్యలు ఉన్నాయి. పెండింగ్ ప్రాజెక్ట్ లు ఉన్నాయి. అవన్నీ కూడా జగన్మోహన్ రెడ్డి హయాంలో పూర్తవుతాయ ని అంతా ఆశల పెట్టుకున్నారు. రాజన్న తనయుడే పూర్తి చేస్తాడని అధికార పార్టీ నేతలు బల్లలు గుద్ది చెప్పుతుంటారు. అయితే జిల్లా వాసులు ఆశించిన రీతిలో ప్రగతి దిశగా అడుగులు పడకపోతుండ డంతో ప్రజలలో నిరాస నిస్పృహలు నెలకొంటున్నాయి.

# భారత రాకెట్ ప్రయోగాలకు 60ఏళ్లు




నెల్లూరు, నవంబర్ 23, భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో 1969లో స్థాపించినా అంతకు ముందు ఎనిమిదేళ్లుగా అంతరిక్ష రంగంలో ఆధునిక శాస్త్రవేత్తలు విస్తృత పరిశోధనలు చేశారు. 1961లో డాక్టర్ హోమీ జహంగీర్ బాబా అంతరిక్ష ప్రయోగాలకోసం డిపార్ట్ మెంట్ ఆఫ్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ ని ప్రారంభించారు. ఆంఇ సంస్థను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి 1962లో ఇండియన్ నేషనల్ కమిటీ ఫర్ స్పేస్ రీసెర్చిగా మార్చారు. ఆ తర్వాత అంతరిక్ష పరిశోధనలు మరింత వేగవంతం అయ్యాయి.భారత్ లో నిర్వహించిన తొలి రాకెట్ ప్రయోగం 59ఏళ్లు పూర్తి చేసుకుంది. ఈ ప్రయోగం జరిగి ఇది అరవయ్యో ఏడాది. సరిగ్గా 59ఏళ్ల క్రితం... అంటే 1963 నవంబర్ 21న నైక్ అపాచి అనే రెండు దశల సౌండింగ్ రాకెట్ ని మొదటిసారిగా ప్రయోగించారు.ఇప్పుడు మనకు శ్రీహరికోటలో లాంచింగ్ స్టేషన్లు ఉన్నాయి కానీ, అప్పటికి అసలు షార్ కేంద్రమే లేదు. రాకెట్ ప్రయోగాలకు శాశ్వత వేదికంటూ లేదు. కేరళలోని తిరువనంతపురం సమీపంలో తుంబా ఈక్విటోరియల్ లాంచింగ్ స్టేషన్ ని ఏర్పాటు చేశారు. తిరువనంతపురం విమానాశ్రయానికి పక్కనే ఉన్న చిన్న మత్స్యకార గ్రామం ఇది. అయితే ఇది భూమధ్య రేఖకు దగ్గరగా ఉన్న ప్రాంతం కావడం, సముద్ర తీరం కావడంతో దీన్ని రాకెట్ ప్రయోగాలకు ఉపయోగించారు. ప్రస్తుతం ఇది ఇస్రో అధీనంలో ఉంది. సౌండింగ్ రాకెట్లను ఇక్కడినుంచే ప్రయోగిస్తుంటారు.1963 నవంబర్ 21న 'నైక్ అపాచి' అనే రెండు దశల సౌండింగ్ రాకెట్ ను మొదటిగా ఇక్కడ ప్రయోగించారు. ఈ ప్రయోగం భారత్ లో జరిగినా దీనికి విదేశీ సాంకేతిక సహాయం అవసరమైంది. ఈ ప్రయోగం జరిగి ఇప్పటికి అరవయ్యేళ్లు. ఆ తర్వాత 1967 నవంబర్ 20న రోహిణి?75 అనే సౌండింగ్ రాకెట్ ను పూర్తి స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించారు. ఆ ప్రయోగం కూడా విజయవంతం అయింది.ఇండియన్ నేషనల్ కమిటీ ఫర్ స్పేస్ రీసెర్చ్ సెంటర్ ను 1969లో భారత అంతరిక్ష పరిశోధనా సంస్థగా మార్చారు. ఆ తర్వాత శ్రీహరికోట భారత రాకెట్ ప్రయోగాలకు వేదికగా మారింది. 1969 ఆగస్ట్ 15న ఇస్రోని స్థాపించారు. శ్రీహరికోట హై ఆల్టిట్యూడ్ రేంజ్ అనే పేరుతో షార్ ఏర్పాటైంది. ఆంధ్రప్రదేశ్ లోని పులికాట్ సరస్సుకు బంగాళాఖాతానికి మధ్యలో 44 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న శ్రీహరికోట దీవిలో దీన్ని ఏర్పాటు చేశారు. ఇది భూమధ్య రేఖకు 13 డిగ్రీల అక్షాంశంలో ఉండడంతో రాకెట్ ప్రయోగాలకు అనువుగా ఉంటుందని భావించారు. ఆ నమ్మకాన్ని శ్రీహరికోట అనతికాలంలోనే నిలబెట్టుకుంది. ఐశ్రీల, జీఐశ్రీల, జూఐశ్రీల, ణఐశ్రీల, ణఐశ్రీల మార్క్–3 ప్రయోగాలు ఇక్కడ జరిగాయి.శ్రీహరికోట రాకెట్ కేంద్రం మొదటి ప్రయోగ వేదిక నుంచి 1979 ఆగస్టు 10న ఐశ్రీల ? 3ఇన్1 పేరుతో రాకెట్ ప్రయోగాలకు శ్రీకారం చుట్టారు. 1980 జూలై 18న ఐశ్రీల ప్రయోగాన్ని విజయవంతంగా నిర్వహించారు. మొత్తం 86 ప్రయోగాలు చేసి 116 ఉపగ్రహాలను కక్ష్యల్లో ప్రవేశ పెట్టారు. 13 స్టూడెంట్ ఉపగ్రహాలు, రెండు రీఎంట్రీ మిషన్లు, 381 విదేశీ ఉపగ్రహాలు కూడా ఇందులో ఉన్నాయి. మూడు గ్రహాంతర ప్రయోగాలు కూడా ఇక్కడినుంచే జరిగాయి. ఇటీవలే తొలి ప్రైవేట్ రాకెట్ ప్రయోగం కూడా విజయవంతమైంది.వీటన్నిటికీ తొలిమెట్టుగా భావించే తుంబా కేంద్రం స్థాపన, అక్కడ రాకెట్ ప్రయోగం ఇప్పటికీ అందరికీ గుర్తుండే ఉంటుంది. ఆ తొలి ప్రయోగం జరిగి ఇది అరవయ్యో సంవత్సరం కావడంతో దేశవ్యాప్తంగా వేడుకలు జరుగుతున్నాయి

# ఆంధ్రాలో పరిశ్రమలు ఎందుకు తరలిపోతున్నాయి?

విజయవాడ, నవంబరు 23, అప్పుడు కియా ఇప్పుడు జాకీ. ఏపీలో పరిశ్రమలు రాకుండా అడ్డుకుంటున్నారా? లేదంటే ప్రభుత్వం, అధికారపార్టీ నేతల తీరు వల్లే పరిశ్రమలు ఆంధ్రాని విడిచివెళ్తున్నాయా? ఇప్పుడిదే ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం అధికార విపక్షాలకు ఉంది. తెలుగురాష్ట్రాలుగా విడిపోయినప్పటి నుంచి ఏపీలో ఎలాంటి అభివృద్ధి లేదనేది కొందరి వాదన. 2014లో కొత్త రాష్ట్రానికి తొలి సిఎంగా చంద్రబాబు ఉన్నప్పటికీ ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదన్న విమర్శలున్నాయి. గత ఎన్నికల్లో వైసీపీ అధినేత జగన్ ముఖ్యమంత్రి అయినప్పటి నుంచి ఇప్పటివరకు కూడా రాష్ట్రంలో కొత్త పరిశ్రమలు ఏపీ రాకపోగా ఆనాడు చంద్రబాబు తెచ్చిన ఒకటి రెండు పరిశ్రమలు కూడా తరలిపోతున్నాయని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఇప్పుడు మరోసారి లోదుస్తుల కంపెనీ జాకీ అనంతపురం జిల్లా నుంచి తెలంగాణకి తరలిపోవడంతో వార్తల్లోకి వచ్చింది. రాప్తాడు ఎమ్మెల్యే ఆయన అనుచరులు లంచం డిమాండ్ చేయడం వల్లే చంద్రబాబు హయాంలో వచ్చిన కంపెనీ తెలంగాణకి వెళ్లిపోయిందని తెలుగుదేశం పార్టీ ఆరోపించింది. ఇలాంటివి జగన్ ప్రభుత్వంపై రావడం ఇది కొత్తకాదు. అధికారంలోకి వచ్చిన తొలినాళ్లల్లో ఇలానే కియా కార్ల కంపెనీ తరలిపోతోందని వార్తలు హడావుడి చేశాయి. రాష్ట్ర అభివృద్ధి కోసం చంద్రబాబు పెద్ద పెద్ద కంపెనీలను ఏపీకి తీసుకువస్తుంటే జగన్ అండ్ టీమ్ తరలిపోయేలా చేస్తోందని అప్పట్లోనే విపక్షాలన్నీ ఒక్కతాటిపైకి వచ్చి ఏకరువు పెట్టాయి. ఈ ఇష్యూ పెద్ద వివాదం కావడంతో కియా కంపెనీ స్పందించింది. అలాంటిదేమీ లేదని ఈ వార్తలు నిజం కాదని చెప్పింది. అయినా కానీ దుమారం సద్దుమణగలేదు. దీంతో వైసీపీ ప్రభుత్వం ఎదురుదాడికి దిగింది. కియా కార్ల కంపెనీకి ఏపీలో అవకాశం ఇచ్చింది వైఎస్ఆర్ ప్రభుత్వం అని చెబుతూ అందుకు సంబంధించిన పలు కీలక డాక్యుమెంట్లను విడుదల చేసింది. అంతేకాదు కియా కార్ల కంపెనీ నుంచి అధికారిక ప్రకటన వచ్చేలా చేసి విపక్షాల విమర్శలకు చెక్ పెట్టగలిగింది. మళ్లీ ఇప్పుడు సేమ్ సీన్ జాకీ కంపెనీ విషయంలోనూ జరుగుతోంది. నిజంగా జాకీ కంపెనీ ఏపీ నుంచి తెలంగాణకి వెళ్లిపోయిందా లేదంటే తెలంగాణలో కూడా కంపెనీని విస్తరించే పనిలో ఉందా ? అన్నది ప్రధాన ప్రశ్న. ఇంకొకటి ఇలా పరిశ్రమలు వెళ్లిపోతున్నాయన్న వార్తల్లో నిజం ఎంత ఉందన్నది తెలియాల్సి ఉంది? ప్రతిపక్షాల కుట్ర వల్ల వెళ్లిపోతున్నాయా లేదంటే నిజంగానే ప్రభుత్వ విధానాలు నచ్చక కంపెనీలు వెళ్లిపోతున్నాయా అన్నది కూడా తేలాల్సి ఉంది. ఏది ఎలా ఉన్నా రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కన్నా కంపెనీలను రాకుండా అడ్డుకోవడంలోనే రాజకీయపార్టీలు రాజకీయాలు చేస్తున్నాయన్న విమర్శలైతే సర్వత్రా వినిపిస్తున్నాయి. మరి ఈ విషయంలో ప్రభుత్వం నుంచి ఎలాంటి వివరణ ఉంటుందన్నది ఆసక్తికరంగా మారింది. రాజకీయ విమర్శలు చేసుకోవడమే తప్పు.. కొత్తగా వచ్చే పరిశ్రమలకు కావాలసిన వాతావరణం, సౌకర్యాలు ఏపీలో ఉన్నాయా అనేది ఒక ప్రశ్న. ఆంధ్రాకి పరిశ్రమలు రావడానికి అధికార ప్రతిపక్షాలు కలసి కట్టుగా పనిచేయాలని కానీ రాష్ట్రాన్ని అభివృద్ధి విషయంలో కూడా రాజకీయాలేనా? అనేది అంతా అనుకుంటున్నారు.

# వడ్డీలకే ఆదాయం

విజయవాడ, నవంబర్ 23,రాష్ట్ర ఖజానాకు వస్తున్న ఆదాయంలో అధికభాగం చేసిన అప్పులకు చెల్లించాల్సిన వడ్డీలకే సరిపోతోంది ఏడాదికి ఏడాదీ వడ్డీల భారం పెరిగిపోతుండడంతో ఇతర కార్యక్రమాలకు నిధులు చాలని పరిస్తితి నెలకొంది. తాజాగా రిజర్వ్బ్యాంకు ప్రకటించిన గణాంకాలు సైతం ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. వీటిప్రకారం రాష్ట్ర ఆదాయంలో సగానికి పైగా వడ్డీలకు చెల్లించాల్సివస్తోంది. గత ఆరేళ్లలో వడ్డీలకు చెల్లించే మొత్తం రెట్టింపుకన్నా ఎక్కువగా రికార్డయింది. రాష్ట్ర అవసరాల కోసం తీసుకునే అప్పుల్లో ఎక్కువ శాతం సెక్యూరిటీ బ్యాండ్లను తనఖా పెట్టడం ద్వారా బహిరంగ మార్కెట్ రుణాల నుంచి తీసుకుంటుండగా, విద్యుత్ బ్యాండ్లు, వేస్ అండ్ మీన్స్, నబార్డ్ రుణాలు, జాతీయ సహకారాభివృద్ధి సంస్థ నుంచి, ఇతర బ్యాంకుల నుంచి తీసుకునే రుణాలు ఉంటాయి. వీటిపై ప్రతి నెలా తప్పనిసరిగా వడ్డీలు చెల్లించాల్సి ఉంటుంది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఏకంగా 22,740 కోట్ల రూపాయలను ముగిసిన ఆర్థిక సంవత్సరంలో వడ్డీగా చెల్లించాల్సి వచ్చింది. రాష్ట్ర విభజన జరిగిన 2014–15లో 10,007 కోట్ల రూపాయల వడ్డీని చెల్లించగా, 2015–16లో కొరత వరకు తగ్గి 9,848 కోట్లు వడ్డీకి చెల్లించారు. అయితే అక్కడి నుంచి మళ్లీ పెరుగుతూ ఖజానాకు భారంగా మారుతోంది. 2020–21 ఆర్థిక సంవత్సరంలో వడ్డీ భారం 22 వేలకోట్లు దాటిపోవడం గమనార్హం.దేశ వ్యాప్తంగా 31 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల వడ్డీ భారం పరిశీలిస్తే ఆరధ్రప్రదేశ్ ఎనిమిదో స్థానంలో నిలిచింది. అత్యధికంగా ఉత్తరప్రదేశ్ 41,603 కోట్ల రూపాయల వడ్డీ చెల్లింపులతో అగ్రస్థానంలో ఉండగా, తరవాత స్థానాల్లో మహారాష్ట్ర, తమిళనాడు, పశ్చిమబెంగాల్, రాజస్థాన్, కేరళ, గుజరాత్ రాష్ట్రాలు ఉ న్నాయి. మరో తెలుగు రాష్ట్రమైన తెలంగాణ 17,584 కోట్ల రూపాయల వడ్డీ భారంతో ఉండడం గమనార్హం.

# కాపు కాసేందుకే కమలం... కసరత్తు



విజయవాడ, నవంబర్ 23, మెగాస్టార్ చిరంజీవిని భారతీయ జనతా పార్టీ మెల్లగా దువ్వుతున్నట్లుగా స్పష్టంగా కనిపిస్తోంది. రెండు రోజుల నుంచి బీజేపీ నేతలు చిరంజీవిని అదే పనిగా పొగుడుతున్నారు. దీనికి కారణం 'ఇండియన్ ఫిల్మ్ పర్సనాలిటీ ఆఫ్ ది ఇయర్–2022' పురస్కారం ఆయనకు లభించడమే. కేంద్రమే ఈ అవార్డు ఇచ్చిందని చెప్పుకోవడంతో పాటు మెగాస్టార్‌కు తాము అమితమైన గౌరవం ఇచ్చామన్న సంకేతాలను పంపడానికి బీజేపీ నేతలు గట్టిగానే ప్రయత్నిస్తున్నారు. ప్రత్యక్ష రాజకీయాలకు దూరమైన మెగాస్టార్‌ను తమ పార్టీలోకి ఆహ్వానించేందుకు బీజేపీ గట్టిగానే ప్రయత్నిస్తోందా ఇండియన్ ఫిల్మ్ పర్సనాలిటీ ఆఫ్ ది ఇయర్ –2022 అవార్డ్ మెగాస్టార్ చిరంజీవిని వరించింది. ఈ అవార్డ్ కోసం చిరంజీవిని ఎంపికచేసినట్లు ఆదివారం కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ ప్రకటించారు. 53వ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా ప్రారంభోత్సవంలో భాగంగా ఈ అవార్డ్‌ను చిరంజీవికి ప్రకటించారు.గతంలో ఈ అవార్డును ఇళయరాజా, బాలసుబ్రహ్మణ్యం, రజనీకాంత్, హేమమాలిని, అమితాబ్‌బచ్చన్, సలీమ్‌ఖాన్ తదితరులు గెలుచుకున్నారు. 2013 నుంచి ఈ అవార్డులను అందజేస్తున్నారు. ఈ ఏడాదికి చిరంజీవికి ప్రకటించారు. ఇలా అవార్డు ఇస్తున్నట్లుగా ప్రకటించిన తర్వాత అలా బీజేపీ నేతలు ప్రశంసల వర్షం కురిపించడం ప్రారంభించారు. చిరంజీవికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రత్యేకంగా తన సోషల్ మీడియా ఖాతా ద్వారా ఈ అవార్డు అందుకున్నందుకు శుభాకాంక్షలు తెలిపారు. అభినందలు తెలిపారు. అక్కడ్నుంచి ఇతర బీజేపీ నేతలు ప్రారంభించారు. చివరికి ఏపీ బీజేపీ అధికారిక ట్విట్టర్ హ్యాండిల్ ద్వారా కూడా అభినందనలు తెలిపారు. ఇక సునీల్ ధియోధర్ లాంటి వాళ్లు ఊరుకుంటారా ? వారు కూడా రంగంలోకి దిగారు. కింది స్థాయి బీజేపీ నేతల గురించి చెప్పాల్సిన పని లేదు. వారి హడావుడి చూస్తుంటే.. చిరంజీవి బీజేపీ నేత అయిపోయారా.. లేకపోతే బలవంతంగా కలిపేసుకుంటున్నారా అన్న డౌట్ ఇతరులకు రావడం ఖాయమే. చిరంజీవిని బీజేపీ ఇటీవలి కాలంలో ప్రత్యేకంగా చూసేందుకు ప్రయత్నిస్తోంది. భీమవరంలో జరిగిన అల్లూరి సీతారామరాజు విగ్రహావిష్కరణకు చిరంజీవిని ఆహ్వానించారు. ఆ కార్యక్రమంలో మోదీ .. చిరంజీవి తనకు ఎంతో ఆప్తమిత్రుడన్నట్లుగా సంభాషించారు. తర్వాత కూడా ఈ పాజిటివ్ ఫీలింగ్ ఉండేలా చూసుకుంటున్నారు. ఇప్పుడు అది ఇంకాస్త ముందుకెళ్తున్నట్లుగా కనిపిస్తోంది. బీజేపీ చిరంజీవిని తమ వాడిగా చేసుకునేందుకు ప్రయత్నిస్తోందన్న భావన రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతోంది. చిరంజీవి సోదరుడు పవన్ కల్యాణ్ బీజేపీతో పొత్తులో ఉన్నారు. అయితే ఆయనకు మద్దతుగా చిరంజీవిని కూడా ప్రత్యక్ష రాజకీయాల్లోకి దింపాలన్న ఆలోచన కూడా బీజేపీ చేస్తున్నట్లుగా భావిస్తున్నారు. ప్రజారాజ్యం పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేసిన తర్వాత కొంత కాలం సైలెంట్‌గా ఉన్న చిరంజీవి.. పవన్ కల్యాణ్ పార్టీ పెట్టిన తర్వాత పూర్తిగా రాజకీయాలకు దూరమయ్యారు. తనకు ఇక ప్రత్యక్ష రాజకీయాలపై ఆసక్తి లేదని ఆయన చాలా సార్లు ప్రకటించారు. పవన్ కల్యాణ్‌ను ఉన్నత స్థానంలో చూస్తామని ఆయన ఆశాభావం వ్యక్తం చేస్తూ ఉంటారు. మరి బీజేపీ ప్రయత్నాలు ఎంత వరకూ ఫలిస్తాయో చూడాలి.

# విశాఖలో ఇన్ఫోసిస్ అడుగులు

విశాఖపట్టణం, నవంబర్ 23, దిగ్గజ ఐటీ సంస్థ ఇన్ఫోసిస్ విశాఖలో పూర్తి స్థాయి కార్యకలాపాలు చేపట్టడానికి అవసరమైన చర్యలను జిల్లా యంత్రాంగం చకచకా తీసుకుంటోంది. ఇప్పటికే విశాఖ రుషికొండ ఐటీ సెజ్‌లో అక్టోబర్ ఒకటిన ఇన్ఫోసిస్ శాటిలైట్ కార్యాలయాన్ని తెరిచింది. త్వరలోనే ఈ ఐటీ సెజ్ నుంచి ఉద్యోగులు విధులు నిర్వహించడానికి ఇన్ఫోసిస్ సన్నద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో తమకు అవసరమైన వనరులు, సదుపాయాల గురించి ఇన్ఫోసిస్ ప్రతినిధులు పరిశ్రమల శాఖ, ఆర్టీసీ, పోలీసు, జీవీఎంసీ తదితర అధికారులతో ఇటీవల చర్చించారు. నగరం నుంచి రుషికొండ ఐటీ సెజ్‌కు ఆ సంస్థ ఉద్యోగులు రాకపోకలు సాగించడానికి వీలుగా బస్సులను నడపాలని ఆర్టీసీ అధికారులను కోరారు. ఇందుకు ఆర్టీసీ అధికారులు సమ్మతిని తెలియజేశారు. ఐటీ కంపెనీల్లో ఉద్యోగులు షిఫ్టుల వారీగా విధులు నిర్వహిస్తారు.

# నల్లారి సెకండ్ ఇన్నింగ్స్ కు ముహూర్తం...



తిరుపతి, నవంబర్ 23, నల్లారి మళ్లీ రాజకీయాల్లో యాక్టివ్ అవ్వబోతున్నారా..? సెకండ్ ఇన్నింగ్స్‌కి ముహూర్తం పెట్టేశారా అంటే.. ఆయన అనుచరుల నుంచి అవుననే సిగ్నల్స్ వస్తున్నాయి. కిరణ్ నుంచి మాత్రం స్పష్టమైన ప్రకటన రావడం లేదు. ఉమ్మడి రాష్ట్రంలో చీఫ్ విప్‌గా, స్పీకర్‌గా.. చివరి ముఖ్యమంత్రిగా పనిచేసిన నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి? తన తండ్రి హయాం నుంచీ కాంగ్రెస్ వాదిగానే ఉన్నారు. అయితే, రాష్ట్ర విభజన విషయంలో కాంగ్రెస్ అధిష్టానంతో విభేదించారు కిరణ్. ఏపీ విభజనను చివరిదాకా ఆపేందుకు ప్రయత్నించి విఫలమైన ఆయన.. సీఎం పదవిని కూడా వదులుకున్నారు. విభజనను అడ్డుకునేందుకు ప్రయత్నించిన నేతగా ఏపీ ప్రజల్లో ఒక ఇమేజ్ అయితే సంపాదించుకున్నారు. ఆ తర్వాత కాంగ్రెస్‌ను వీడి? సమైక్యాంధ్ర పార్టీ స్థాపించినా విజయవంతం కాలేదు. 2014 ఎన్నికల తర్వాత రాజకీయంగా సైలెంటైన కిరణ్? విభజనను వ్యతిరేకించారే తప్ప ఎప్పుడూ కాంగ్రెస్‌ను విమర్శించలేదు. రాజకీయాలకు దూరంగా ఉన్నా.. కాంగ్రెస్ మనిషిగానే ఉన్నారు. 2018లో మళ్లీ రాహుల్ సమక్షంలో పార్టీలో చేరారు.కాగా తిరిగి ఏపీ రాజకీయాల్లో కాంగ్రెస్ పార్టీ నిలదొక్కుకోవాలంటే కిరణ్ కుమార్ లాంటి బలమైన నేతకు పార్టీ పగ్గాలు అప్పగించాలనే చర్చ జరుగుతోంది. ఇదే సమయంలో పార్టీలో సీనియర్ నేత అయిన ఆయన సేవలను జాతీయ స్థాయిలో వినియోగించుకోవాలనే అభిప్రాయంలోనూ కాంగ్రెస్ అధిష్టానం ఉందనే ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో హైకమాండ్ పిలుపు మేరకు ఈ ఏడాది మేలో ఢిల్లీ వెళ్లిన కిరణ్.. దాదాపుగా 45 నిమిషాల పాటు పలు అంశాలపై సోనియా గాంధీతో చర్చించారు. కానీ అందుకు సంబంధించిన డీటేల్స్ మాత్రం బయటకు రాలేదు. రాష్ట్ర పీసీసీ పగ్గాలు చేపట్టమని సోనియా అడిగారని.. తనకు ఏఐసీసీ పదవి కానీ, సిడబ్ల్యుసి మెంబర్ గాని, సౌత్ కాంగ్రెస్ ఇంచార్జ్ పదవి గాని కావాలని కిరణ్ కోరినట్లు ప్రచారం జరిగింది. కానీ ఏమైందో తెలియదు కానీ ఆ తర్వాత మళ్లీ కిరణ్ పూర్తిగా సైలెంటయ్యారు. అయితే ప్రజంట్ కాంగ్రెస్ కేడర్ మాత్రం కిరణ్‌పై గుర్రుగా ఉంది.. ఇటీవల జోడో యాత్ర ఏపీలోకి ప్రవేశించినప్పుడు కిరణ్ పాల్గొనలేదు. కనీసం మద్దతు కూడా తెలపలేదు. దీంతో కిరణ్ కుమార్ రెడ్డి పాల్గొన్న బాలయ్య అన్‌స్టాపబుల్ షోపై అందరి ఫోకస్ పడింది. అక్కడ అన్ని విషయాల గురించి చర్చించే ఉంటారు. కిరణ్ కాంగ్రెస్‌లోనే కొనసాగుతారా..? ఆయన ఏపీ పాలిటిక్స్‌లో యాక్టివ్ అవుతారా..? తన వృద్ధికి కారణమైన కాంగ్రెస్‌కు మళ్లీ ఊపిరి పోసేందుకు పూనుకుంటారా..? లేదా మరో పార్టీని చూసుకుంటారా..? లేదా ఇక రాజకీయ సన్యాసమేనా అన్నది రానున్న అన్‌స్టాపబుల్ ఎపిసోడ్‌తో తేటతెల్లం కానుంది.

# భూ హక్కు సర్వేల్లో అవకతవకలు


విజయవాడ, నవంబర్ 23,భూహక్కు, భూరక్ష పథకం కింద నిర్వహిస్తున్న సర్వేలో పెద్దఎత్తున అవకతవకలు చోటుచేసుకుంటు న్నాయి. భూ రికార్డులను డిజిటలైజ్ చేయాలనే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన ఈ పథకం రైతులకు శాపంగా మారుతోంది. రాష్ట్రంలో కృష్ణాజిల్లా జగ్గయ్యపేట మండలం షేర్‌మహ్మద్‌పేటలో ప్రయోగాత్మకంగా చేసిన ఈ పథకంలో అనేక లోపాలు వెలుగులోకి వచ్చాయి. వీటిని ఏమాత్రం సవరించకుండానే రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి జిల్లాలో కనీసం నాలుగు మండలాల్లో మండలానికి ఒక గ్రామం చొప్పున ప్రయోగాత్మకంగా సర్వే నిర్వహించారు. రోవర్లు, డ్రోన్లు ఇలా ఆధునిక పద్ధతుల్లో చేపట్టిన ఈ సర్వేలోనూ అనేక లోపాలను గుర్తించారు. అయినా, వీటిని సరిచేయలేదు. ఆంధ్రప్రదేశ్ సర్వే మరియు సరిహద్దు చట్టం 1923 సెక్షన్ 13 ప్రకారం సర్వే విజయవంతంగా పూర్తయిందని ప్రకటించి తహశీల్దార్లకు టార్గెట్లు పెట్టారు. దీంతో తహశీల్దార్లు, సర్వే అధికారులు ఎక్కడికక్కడ సర్వేలు నిర్వహించి ఫైనల్ నోటిఫికేషన్లు ఇస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ సర్వే మరియు సరిహద్దు చట్టం 1923 సెక్షన్ 14 ప్రకారం ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే సివిల్ కోర్టుల ద్వారా తేల్చుకోవాలని ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్లలోనే పేర్కొన్నారు. అయితే ఎక్కువ గ్రామాల్లో భూ కమతాల్లో భూములు వారి దగ్గర ఉన్న రికార్డులకంటే తక్కువగా ఉన్నట్లు చూపెడుతున్నారు. బ్రిటీష్‌కాలంలో సర్వే నిర్వహించారని, మరలా ఇప్పుడు నిర్వహిస్తున్నారని సరిహద్దులు స్వల్పంగా మారే అవకాశం ఉంటుందని వ్యవసాయశాఖ మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు గతంలోనే తెలిపారు. సర్వే అనంతరం రికార్డుల్లో తక్కువ చూపించిన రైతులతో సంప్రదించి మార్పులు చేర్పులు చేసిన తరువాత ఫైనల్ నోటిఫికేషన్ ఇవ్వాలని వ్యవసాయ రంగ నిపుణులు ఎర్నేని నాగేంద్రనాథ్ సూచించారు. ఒక గ్రామంలో 23 ఎకరాల భూమి ఉంటే 13 సెంట్లు చూపించారని, దీనిపై కనీస వివరణ ఇవ్వలేదని ఆయన పేర్కొన్నారు. విజయనగరం జిల్లా మెరకముడిదాం మండల పరిధిలోని ఓ గ్రామంలోనూ ఇదే సమస్య వచ్చిందని, అక్కడి రైతు తెలిపారని వివరించారు. దీనిపై సిసిఎల్‌ను కలవగా ఫైనల్ నోటిఫికేషన్ ఇచ్చే ముందు రైతులతో సంప్రదింపులు జరపాలని సూచిస్తూ సర్క్యులర్ ఇచ్చారని, అదే సమయంలో టార్గెట్ పెట్టారని చెప్పారని ఆయన వివరించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ తీరుపై రైతులు ఆగ్రహంగా ఉన్నారు. ఒక్కసారి ఫైనల్ నోటిఫికేషన్ ఇస్తే కోర్టు ద్వారా తేల్చుకోవాల్సి ఉంటుందని, అది ఇప్పట్లో తేలే అవకాశం ఉండదని అంటున్నారు. దీనిపై సిపిఎల్‌ఏను కలిసి వినతిపత్రం ఇద్దామని, సమస్యను వివరిద్దామని అనుకున్నా అపాయింట్‌మెంట్ దొరకడం లేదని రైతు నాయకులు చెబుతున్నారు. దీనిపై చర్చించుకుని త్వరలోనే భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామంటున్నారు. ఈ సర్వేలో అన్నీ అక్రమాలు జరుగుతున్నాయని మొత్తం గ్రామంలో 600 ఎకరాలు ఉన్నాయనుకుంటే లెక్కలు మారినా అంతే విస్తీర్ణాన్ని చూపించాలని, కానీ తక్కువ చేసి చూపిస్తున్నారనిఅంటున్నారు. దీనివెనుక మోసం ఉందని, దీనిపైనా తేల్చాల్సి ఉంటుందని భూ యజమానులు డిమాండు చేస్తున్నారు. 2023 జనవరి నాటికి రాష్ట్ర వ్యాప్తంగా సర్వే పూర్తిచేసి మ్యాపులు ఇస్తారని, అనంతరం అంతకుముందున్న రికార్డున్నీ తొలగిస్తారని, దీనివల్ల రైతులకు తీవ్ర నష్టం కలుగుతుందని రైతు సంఘం రాష్ట్ర సీనియర్ నాయకులు వై.కేశవరావు తెలిపారు. సర్వే సక్రమంగా జరగడం లేదని, అధికారులు ఇష్టం వచ్చినట్లు చేసుకుపోతున్నారని పేర్కొన్నారు. సర్వే సమయంలో రైతులతో చర్చించి రికార్డులు పరిశీలించి సర్వే చేయాలని చట్టంలో ఉందని, అలా కాకుండా తాము సర్వే చేశామని చెబుతూ నేరుగా బోర్డులు పెట్టేస్తున్నా రని వివరించారు. ప్రస్తుతం 1500 గ్రామాల్లో సర్వే జరుగుతోందని, పూర్తయితే గానీ మరిన్ని విషయాలు వెలుగులోకి రావని ఆయన చెప్పారు.

# స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్రా బ్యాంకు వ్యవస్థాపకుడు

స్వాతంత్ర్య సమరయోధుడిగా, భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడిగా, ఆంధ్రా బ్యాంకు వ్యవస్థాపకుడిగా భోగరాజు పట్టాభి సీతారామయ్య సేవలందించారు. 24 నవంబర్ 1880 న మద్రాసు ప్రెసిడెన్సీ రాష్ట్రములోని కృష్ణా జిల్లా ( పశ్చిమ గోదావరి జిల్లా, గుండుగొలను ) గ్రామములో జన్మించాడు . భారత జాతీయోద్యమ సమయంలో గాంధీజీ చే ప్రభావితుడై ఉద్యమంలో చేరి అతడికి సన్నిహితుడై కాంగ్రెస్‌లో ప్రముఖ స్థానం ఆక్రమించాడు. 1939లో గాంధీజీ అభ్యర్థిగా కాంగ్రెస్ అధ్యక్ష పదవికి పోటీపడి నేతాజీ చేతిలో ఓడిపోయిననూ 1948లో పురుషోత్తమ దాస్ టాండన్ పై విజయం సాధించాడు. ఆ తర్వాత పార్లమెంటు సభ్యుడిగా, మధ్యప్రదేశ్ గవర్నర్గా పనిచేశాడు. రాష్ట్రం బయట పనిచేసిననూ తెలుగు భాషపై మమకారం కోల్పోలేదు. తను స్థాపించిన ఆర్థిక సంస్థలలో ఉత్తర ప్రత్యుత్తరాలు తెలుగులోనే జరగాలని సూచించాడు.పశ్చిమ గోదావరి జిల్లా గుండుకొలను గ్రామంలో 1880, నవంబర్ 24 న బ్రాహ్మణుల ఇంటిలో పట్టాభి జన్మించాడు. వారి ఇంట్లో ప్రతి సంవత్సరం రామపట్టాభిషేకం జరిపే ఆచారం ఉండేది. అందుకే తల్లిదండ్రులు పట్టాభి సీతారామయ్య అనే పేరు పెట్టినారు. ఇతని తండ్రి భోగరాజు వెంకట సుబ్రహ్మణ్యం పంతులు గుండుగొల్లు గ్రామ కరణంగా పనిచేసేవాడు. సీతారామయ్యకు ఒక అన్న ఆరుగురు అక్కచెల్లెళ్ళు ఉన్నారు. ఇతని నాలుగవయేటనే తండ్రి మరణించడంతో కుటుంబభారం తల్లి గంగమ్మ మీద పడింది. పిల్లల విద్యాభ్యాసం కొరకు ఆమె తన కుటుంబాన్ని ఏలూరుకు తరలించింది. ఇతడు తన ప్రాథమిక విద్యను ఏలూరు లోని మిషన్ హైస్కూలులో చదివాడు. అక్కడ మెట్రిక్యులేషను పూర్తి అయిన తరువాత బందరులోని నోబుల్ కాలేజీలో ఎఫ్.ఎ. పరీక్ష ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడైనాడు. అక్కడ రఘుపతి వెంకటరత్నం నాయుడుకు ఇతడు ప్రియశిష్యుడు. ఉన్నత విద్యకై మద్రాసు (నేటి చెన్నై) వెళ్ళి మద్రాసు క్రైస్తవ కళాశాల నుండి బి.ఏ. డిగ్రీ 1900లో పొందాడు. ఆ తరువాత ఇతడు మద్రాసులోని ప్రభుత్వ వైద్యకళాశాలలో ఎం.బి.సి.ఎం. డిగ్రీ 1905లో సాధించి డాక్టరు కావాలనే తన ఆశయాన్ని నెరవేర్చుకున్నాడు.పిఠాపురం మహారాజావారి కోరికను కాదని బందరులో డాక్టరుగా జీవితాన్ని ఆరంభించాడు పట్టాభి. బందరు జీవితం పట్టాభిని బాగా తీర్చిదిద్దింది.చదువు పూర్తైన తర్వాత మచిలీపట్నంలో డాక్టరుగా ప్రాక్టీసు పెట్టాడు కానీ లాభదాయకమైన సంపాదనను వదులుకొని గాంధీజీచే ప్రభావితుడై బ్రిటిషు వారికి వ్యతిరేకంగా స్వాతంత్ర్య ఉద్యమములో పాల్గొన్నాడు. కాంగ్రెస్ పార్టీలో పట్టాభీ గాంధీజీకి అతి సన్నిహితంగా ఉండేవాడు. 1939లో భారత జాతీయ కాంగ్రెసు పార్టీ అధ్యక్ష పదవికి అతివాద అభ్యర్థి అయిన సుభాష్ చంద్రబోస్కు వ్యతిరేకముగా, మహాత్మా గాంధీ అభిమతానికి దగ్గరైన వాడిగా పట్టాభిని పోటీలో నిలబెట్టారు. అయితే నేతాజీ పెరుగుతున్న ప్రాబల్యం, పట్టాభి స్వాతంత్ర్యానంతరం, తమిళ ఆధిపత్యమున్న కొన్ని జిల్లాలను భావి తెలుగు

**భోగరాజు పట్టాభి సీతారామయ్య**

రాష్ట్రములో కలపటానికి మద్దతునిస్తున్నాడన్న భావన ఈయన ఓటమికి కారణమయ్యింది. పట్టాభి ఓటమి తన ఓటమిగా గాంధీజీ భావించి బాధపడ్డాడు. ఆ తరువాత మళ్ళీ 1948లో జరిగిన కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికలలో పురుషోత్తమ దాస్ టాండన్ పై గెలిచి స్వతంత్ర భారత తొలి కాంగ్రెస్ అధ్యక్షుడిగా అవతరించాడు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమ ప్రారంభములో కాంగ్రెసు పార్టీ కార్యాచరణ వర్గంలో పనిచేస్తూ ఉండగా మొత్తం కార్యాచరణ వర్గ సహితంగా పట్టాభిని అరెస్టు చేసి మూడేళ్లపాటు అహ్మద్ నగర్ కోటలో బయటి వ్యక్తులెవ్వరితో సంబంధాలు లేకుండా బంధించి చిత్రహింసల పాలు చేశారు. బందీగా ఉన్న ఈ సమయంలో పట్టాభి తన దినచర్యను గూర్చి విస్తారమైన డైరీ నిర్వహించాడు. దీనినే ఆ తదనంతరం ఫెదర్స్ అండ్ స్టోన్స్ (ఈకలు, రాళ్ళు) గా ప్రచురించారు.పట్టాభి 1907 బాంబే కాంగ్రెస్ సభలకు హాజరై స్వదేశీ నినాదం మీదప్రసంగించారు.అదే సంవత్సరం లాల్, బాల్, పాల్ త్రయంలోని బిపిన్ చంద్రపాల్ ఆంధ్రలోని పర్యటించారు. దాని ఫలితంగా కోస్తాఆంధ్రలో జాతీయోద్యమానికి నూతన ఉత్తేజం చేకూరింది.1908లో జరిగిన మొదటి మితవాద కాంగ్రెస్ కు పట్టాభి హాజరయ్యారు. బందరులో జాతీయ కళాశాల స్థాపన ఉద్దేశం ఏర్పడింది.1910లో బందరులో ఆంధ్రజాతీయ కళాశాల స్థాపించబడింది. ఆ కళాశాలలో 1914లో కుటీర పరిశ్రమలూ, 1916లో చేనేత ప్రవేశపెట్టారు. గాంధీజీ ఆకళాశాలను 1921,29లలో దర్శించి సంతోషపడ్డారు. 1916లో మొదటిసారిగా పట్టాభిగారు మద్రాసు కాంగ్రెస్ కమిటీ సహాయంలో సభ్యుడయ్యారు. రాజకీయాలకు, వృత్తి కుదరక 1916 సెప్టెంబరులో తన వృత్తికి స్వస్తి చెప్పారు.నాటికు ఆయన 26 సంవత్సరాలు.1927లో ప్రకాశం పంతులుగారు రెవెన్యూమంత్రి కావటంతోనే పట్టాభి ఏఐసిసి అధ్యక్షుడు అయ్యారు.ఆర్థికంగా కార్యక్రమాలన్నీ ఏఐసిసి చాలా సమర్థవంతంగా పనిచేసిందనుకుంటే పట్టాభి హయంలో మిగతా రంగాలలో అల్లకల్లోలం చెలరేగింది. పట్టాభి వ్యక్తిత్వము ముక్కుకు సూటిగాపోయే గుణము, మాటలలో పరుశ్వత్వము, అప్పుడప్పుడే చెలరేగుతున్న రెడి-కమ్మ భావాలు, చివరగా ఆయన చర్యలూ-ఈ అల్లకల్లోలానికి కారణాలు.1951లో సంజీవరెడ్డి చేతుల్లో 5కోట్ల తేడాలో ఆచార్య ఎన్.జి. రంగా ఓడిపోవడానికి పట్టాభి అదృశ్యహస్తం ముందంటారు కొందరు.1953లో ఆంధ్రరాష్ట్రం ఏర్పడడంతో రాష్ట్ర రాజకీయాలలో పట్టాభి ప్రాబల్యం తగ్గింది. జాతీయ రాజకీయాలలో పట్టాభికి తుల్యమైన పాత్రను పోషించిన ఆంధ్రులు ఎక్కువమంది లేరనే చెప్పవచ్చును.ప్రథమంలో లాల్-బాల్-పాల్ ల అతివాద ధోరణిపట్ల మొగ్గుచూపినా రానురాను పట్టాభి గాంధీజీకి దగ్గర కాసాగారు.తెలుగు ప్రజలకు ఒక ప్రత్యేక రాష్ట్రం ఉండాలని దాని కొరకు పట్టాభి ఎంతగానో కృషిచేశాడు. పట్టాభి చొరవతోనే ఆంధ్ర రాష్ట్రోద్యమానికి అంకురార్పణ 1908లో బందరులో జరిగింది. బందరు సమావేశంలో



తెలుగు జిల్లాల ప్రముఖులందరూ సమావేశమై ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం గురించి చర్చించారు. ఆ తరువాతనే 1913లో బాపట్లలో తొలి ఆంధ్రమహాసభ జరిగింది. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ఆవశ్యకత గురించి పట్టాభి ఆంగ్లంలో ఒక గ్రంథమే రచించాడు. పట్టాభి కృషి వల్లనే 1920లో కాంగ్రెసు పార్టీ ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు సూచనప్రాయంగా ఆమోదించింది.పట్టాభి సీతారామయ్య ఎన్నో ఆర్థిక సంస్థలను స్థాపించాడు. ఆంధ్రా బ్యాంకు (1923లో స్థాపన), ఆంధ్రా ఇన్స్యూరెన్స్ కంపెనీ, భారత లక్ష్మి బ్యాంకు, కృష్ణా కో-ఆపరేటివ్ బ్యాంకు మొదలగునవి స్థాపించాడు. ఆంధ్రాబ్యాంకు ద్వారా వ్యవసాయదారులకు రుణాలిచ్చి వ్యవసాయాభివృద్ధికి తోడ్పడినాడు. చిన్న మొత్తంలో డిపాజిట్లు సేకరించి పొదుపును ప్రోత్సహించాడు.ఇతడు 1919లో మచిలీపట్నం నుండి జన్మభూమి అనే ఆంగ్ల వారపత్రికను స్థాపించాడు. ఆ కాలంలో ఆంధ్ర, మద్రాసు రాష్ట్రాలలో ఆంధ్రుల సంపాదకత్వంలో వెలువడే ఆంగ్ల పత్రికలు లేవు. ఆ కొరతను తీర్చడానికి ఇతడు జన్మభూమిని ప్రారంభించాడు. ఈ పత్రిక ఇతని సంపాదకత్వంలో 1930 వరకు వెలువడింది. ఈ పత్రికలోని సంపాదకీయ వ్యాసాలు ఇతని ఆంగ్లభాషా నైపుణ్యాన్ని దేశానికి చాటింది. నాటి త్రయం పట్టాభి రామయ్య, కొంపెల్ల హనుమంతరావు, ముట్నూరు కృష్ణారావు గారి త్రయం 1902లో కృష్ణాపత్రికను స్థాపించారు.స్వాతంత్ర్యం తరువాత 1948లో కాంగ్రెసు అధ్యక్ష పదవి పోటీలో నెగ్గి పీఠాన్ని అధిష్టించాడు. ఆ తరువాత 1952లో రాజ్యసభ సభ్యునిగా ఎన్నికై పార్లమెంటులో ప్రవేశించాడు. 1952 నుండి 1957 వరకు మధ్యప్రదేశ్ గవర్నరుగా పనిచేశాడు. తెలుగు ప్రజలకు ఎంతగానో తోడ్పాటు అందించిన పట్టాభి 1959, డిసెంబర్ 17న స్వర్గస్థుడయ్యాడు.వీరి గౌరవార్థం 17 -12-1997 న ఒక ప్రత్యేక తపాల బిళ్ళను విడుదల చేసారు.

# ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే పంటలు నీట మునిగాయి

కర్నూలు ప్రభుత్వం నిర్లక్ష్యంతోనే పంట పొలాలు నీట మునిగి రైతులకు తీవ్ర నష్టం వాటిలిందని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి విమర్శించారు.నంద్యాల జిల్లా కోవెలకుంట్ల మండలంలోని వల్లంపాడు గ్రామంలో నీట మునిగిన పంట పొలాలను బీసీ జనార్దన్ రెడ్డి మంగళవారం పరిశీలించారు. అంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ ఎస్ఆర్బిసి కాలువ 7వ బ్లాకు తెగి దాదాపు 50 ఎకరాల పంట పొలాలు నీట మునిగి రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. దెబ్బతిన్న ఎస్ఆర్బిసి కాలువలను మరమ్మతులు చేయకపోవడం వలన పెద్ద ఎత్తున నష్టం జరిగిందని ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని పంట కాలువలను పటిష్టం చేయాలని అలాగే రైతులకు నష్టపరిహారాన్ని అందించాలని డిమాండ్ చేశారు.

# కుళ్లిపోయిన స్థితిలో మావోయిస్టు మృతదేహం లభ్యం

దంతేవాడ చత్తీస్ ఘడ్ రాష్ట్రంలో దంతెవాడ జిల్లా కువకొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని భూసారస్ లోయ సమీపంలోని జియాకోర్టా అటవీ ప్రాంతంలో మృతదేహం లభ్యమయింది. ఎనిమిది లక్షల రివార్డు ఉన్న మావోయిస్టు కమాండర్ దేవా అలియాస్ తిర్రా మద్కామి మృతదేహంగా పోలీసులు గుర్తించారు. కటెకల్యాణ్ ఏరియా కమిటీ సభ్యుడు దేవాపై గతంలో సంఘవిద్రోహక చర్యలపై పలు కేసులు నమోదయి ఉన్నాయి. గత కొద్ది రోజుల క్రితం మృతి చెందిన దేవా మృతదేహం వద్ద ఒక ఆయుధం, బ్యాగ్ ను స్వాధీనం చేసుకున్నారు. మావోయిస్టు కమాండర్ దేవా మృతికి గల కారణాలపై విచారణ ప్రారంభించినట్టు ఎస్పీ సిద్దార్థ్ తివారి వెల్లడించారు.

# నీటి ట్యాంక్ పై నుండి దూకి వ్యక్తి ఆత్మహత్యాయత్నం

**రక్షించిన పిచ్చాటూరు పోలీసులు**

తిరుపతి తిరుపతి జిల్లా పిచ్చాటూరు మండలం రాజానగరం గ్రామంలో సుబ్రహ్మణ్యం(42) అనే వ్యక్తి మంగళవారం గ్రామంలోని తాగునీటి ట్యాంక్ పై ఎక్కి ఆత్మహత్యకు యత్నించాడు. సమాచారం అందుకున్న పిచ్చాటూరు ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి హుటాహుటిన తన సిబ్బందితో కలిసి రాజానగరం చేరుకున్నారు. అప్పటికే ట్యాంక్ పై ఉన్న సుబ్రహ్మణ్యం తో చాకచక్యంగా మాట్లాడారు. మెల్లగా ఎస్సై ట్యాంక్ పైకి ఎక్కి సుబ్రహ్మణ్యంకు జీవితం పై బరోసా కల్పించి క్షేమంగా కిందకి దించారు. దీంతో సుబ్రమణ్యం కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సుబ్రహ్మణ్యం తల్లి కృష్ణవేణి గత వారం పుత్తూరు లో రైలు కింద పడి ఆత్మ హత్య చేసుకొని మరణించారన్నారు. ఆ బాధను తట్టుకోలేకనే సుబ్రహ్మణ్యం ఆత్మహత్యకు యత్నించాడని వివరించారు. చాకచక్యంగా వ్యవహరించి నిండు ప్రాణాలను కాపాడిన ఎస్సై శ్రీకాంత్ రెడ్డి, పోలీసు సిబ్బందికి సుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

# కల్పవృక్ష వాహనంపై శ్రీ రాజమన్నార్ అలంకారంలో సిరుల తల్లి...

తిరుచానూరు తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి వార్షిక కార్తీక బ్రహ్మోత్సవాలలో భాగంగా నాలుగో రోజు బుధవారం ఉదయం అమ్మవారు శ్రీ రాజమన్నార్ అలంకారంలో చర్నాకోలు, దండం ధరించి కల్పవృక్ష వాహనంపై భక్తులను కటాక్షించారు. అశ్వాలు, వృషభాలు, గజాలు ముందు కదులుతుండగా మంగళవాయిద్యాలు, భక్తుల కోలాటాల నడుమ అమ్మవారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో భక్తులకు అభయమిచ్చారు. ఉదయం 8 నుండి 10 గంటల వరకు వాహనసేవ సాగింది. అడుగడుగునా భక్తులు కర్పూర హారతులు సమర్పించి అమ్మవారిని సేవించుకున్నారు. పాలకడలిని అమృతం కోసం మథించినవేళ లక్ష్మీదేవికి తోబుట్టువైంది కల్పవృక్షం. ఈ ఉదారదేవతావృక్షం అన్ని కోరికలనూ తీరుస్తుంది. ఖడ్గాన్ని, యోగదండాన్ని ధరించే గోపకిశోరుడిలా గోసంపదను పరిరక్షించే మంగళదేవత అలమేలుమంగ. మంగమ్మ పాదాలు కల్పతరువు చిగురును తలపిస్తున్నాయని అన్నమయ్య కీర్తించారు. కోర్కెలను ఈడేర్చే కల్పవృక్షంపై విహరిస్తున్న అలమేలుమంగ ఆశ్రితభక్తులకు లేముల్ని తొలగించే పరిపూర్ణశక్తి. మధ్యాహ్నం 12.30 గంటల నుండి శ్రీ కృష్ణస్వామి మండపంలో అమ్మవారికి శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహించనున్నారు. ఇందులో పసుపు, చందనం, పాలు, పెరుగు, తేనె, పన్నీరు, వివిధ రకాల ఫలాలతో అభిషేకం చేస్తారు. అనంతరం అమ్మవారికి విశేషంగా అలంకారం చేశారు.



# నేడు బ్రౌన్ గ్రంథాలయంలో రా రా శతజయంతి సదస్సు



కడప కల్చరల్ నవంబర్ 23: సాహిత్య అకాడమి, యోగి వేమన విశ్వవిద్యాలయం పరిధిలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంయుక్త నిర్వహణలో రా రా (రాచమల్లు రామచంద్రారెడ్డి) శతజయంతి సదస్సును నేడు గురువారం ఉదయం 10.00 గంటలకు కడప లోని ఎర్రముక్క పల్లె లోఉన్న సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో నిర్వహించను న్నామని బ్రౌన్ కేంద్రం బాధ్యులు డా. మూల మల్లికార్జున రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు ప్రారంభంలో ముఖ్యఅతిథిగా యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య మునగల సూర్యకళావతి, సభాధ్యక్షులుగా సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి, గౌరవ అతిథిగా సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి పాల్గొంటారని, సాహిత్య అకాడమి తెలుగు సలహా మండలి సభ్యులు డా యాకూబ్ కీలకోపన్యాసం చేస్తారని డామూల మల్లికార్జున రెడ్డి సభా ప్రస్తావన చేస్తారని అన్నారు. తదనంతరం జరిగే మొదటి సదస్సుకు రాచపాళెం చంద్రశేఖర రెడ్డి అధ్యక్షత వహించి 'మార్క్సిస్టు విమర్శకుడుగా రారా' అనే అంశంపై, చింతకుంట శివారెడ్డి 'రారా జీవితం, వ్యక్తిత్వం' అనే అంశంపై పత్ర సమర్పణ చేస్తారని, భోజనానంతరం జరిగే రెండవ సదస్సుకు కిన్నెర శ్రీదేవి అధ్యక్షత వహించి 'కథారచయితగా రారా' అనే అంశంపై, తుమ్మలూరు సురేష్‌బాబు 'పాత్రికేయుడుగా రారా' అనే అంశంపై పత్ర సమర్పణ చేస్తారని, మూడవ సదస్సుకు మందలపర్తి కిశోర్ అధ్యక్షత వహించి 'అనువాదకుడుగా, అనువాద అధ్యయనశీలిగా రారా' అనే అంశంపై, ఆర్.రాజేశ్వరమ్మ 'రారా లేఖలు, ముందుమాటలు' అనే అంశంపై పత్ర సమర్పణ చేస్తారని అన్నారు. సాయంత్రం 4 గంటలకు జరిగే ముగింపు సమావేశానికి యోగి వేమన విశ్వవిద్యాలయం కులసచివులు ఆచార్య దుర్భాక విజయ రాఘవ ప్రసాద్ అధ్యక్షత వహిస్తారని, సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం బాధ్యులు డా.మూల మల్లికార్జున రెడ్డి కార్యక్రమ నివేదికను సమర్పిస్తారని, విశ్రాంత ఆకాశవాణి సంచాలకులు డా? తక్కోలు మాచిరెడ్డి సమాపన ప్రసంగం చేస్తారని, సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డా? భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి వందన సమర్పణతో కార్యక్రమం ముగుస్తుందని అన్నారు.

# సీఎం పర్యటన తో బస్ స్టాండ్ కాలీ

శ్రీకాకుళం శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట లో జగనన్న భూ హక్కు పథకాన్ని ప్రారంభోత్సవానికి వస్తున్న నేపథ్యంలో నరసన్నపేట బస్ స్టాండ్ మొత్తం కాలీ చేయించారు. విఐపి వాహనాలను బస్ స్టాండ్ లో పార్కింగ్ కి ఏర్పాటుచేశారు. దీంతో ప్రయాణికులు,సుదూర ప్రాంతాలకు వెల్లవలిసిన వారు చాలా ఇబ్బందులు పడుతున్నారు. డిగ్రీ సెమిస్టర్ పరీక్షలకు వెల్లవలిసిన విద్యార్థులు బస్ స్టాండ్ లో నిరీక్షించారు. బస్ స్టాండ్ లో బస్ లు వస్తున్నాయని సమాచార కేంద్రంలో చెబుతున్నారు. కానీ ఉదయం నుండి కూడా ఒక్క బస్ కూడా రావడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నంద్యాల వైకాపా అధికారంలోకి వచ్చిన అనంతరం కోట్ల రూపాయలు వెచ్చించి నియోజకవర్గంలో అభివృద్ధి కి చర్యలు చేపట్టినట్లు నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి అన్నారు. ఆయన మాట్లాడుతూ నంద్యాల పట్టణంలోని నేషనల్ కర్నూలు కడప హైవే బొమ్మల సత్రం ఫ్లైఓవర్ బ్రిడ్జి నుండి నూనెపల్లె ఫ్లైఓవర్ బ్రిడ్జి వరకు 2.5 కిలోమీటర్లు వరకు 13 కోట్ల 40 లక్షల రూపాయల తో రోడ్డు వైడింగ్ చేసి రెండు సైడ్లు డ్రైను నిర్మించడం జరుగుతుందన్నారు. బుధవారం నాడు పనులను ప్రారంభించారు. ముఖ్యంగా కలెక్టర్ కార్యాలయం ఉండడంతో అక్కడ ట్రాఫిక్ ఎక్కువ ఉండడం ప్రజల రద్దీ పెరగడంతో రోడ్డు వెడల్పు చేయడం జరుగుతుందన్నారు. రోడ్లు పూర్తి అయితే ట్రాఫిక్ సమస్య కూడా తీరుతుందని పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. మధ్యలో బొగ్గులైన్ నివాసితులకు ఆల్టనెట్ నివాసాలు కూడా చూపించడం జరిగిందని వారికి ఇచ్చిన నివాసలు కూడా త్వరగా పూర్తి చేసి వారికి అందజేయలని అధికారులను కోరారు. కార్యక్రమంలో ఎంపీ పోచ బ్రహ్మానంద రెడ్డి. కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ వైయస్ అర్ సీ పీ నాయకులు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## శ్రీ లక్ష్మి ఉరుకుంద ఈరన్న స్వామి లో బారి సంఖ్యలో భక్తులు స్వామివారి ఆలయంలో భక్తుల సందడే సందడి

కౌతాళం :ఉరుకుంద ఈరన్న స్వామి వెలసిన ప్రముఖ పుణ్య క్షేత్రము శ్రీ లక్ష్మి నరసింహ ఈరన్న స్వామి పుణ్యక్షేత్రం బుధవారం కార్తీక మాసం ఆఖరి అమావాస్య విశేష పూజలు సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. కోరిన వారికి కోరికలు నెరవేర్చే శ్రీ శ్రీ నరసింహస్వామి, భక్తుల పాలిట కోరిన కోర్కెలు తీర్చే కల్ప వృక్షం స్వామి వారి విశేష దినోత్సవన్ని పురస్కరించుకొని ఆలయ అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. స్వామి వారి మూల విరాట్ ను పూలు వెండి ఆభరణాలు తో అలంకరించారు. ఉదయం 5 గంటల సుప్రభాత సేవ నుంచి రాత్రి ఏడు గంటల వరకు మంగళ హారతి నిర్యహించరు. ప్రత్యేక రుసుము చెల్లించి అనుమతి పొందిన భక్తుల సమక్షంలో ఎనిమిది నుంచి పది వరకు అవినేటి మండపంలో స్వామి వారికి పంచామృత అభిషేకలు సాయంత్రం ఆరు నుంచి ఏడూ వరకు ధ్వజ స్థంభం వద్ద ప్రకరోత్సవాలు నిర్వహించారు మధ్యాహ్నం స్వామి వారికి మహా నైవేద్యాన్ని సమర్పించారు. స్వామి వారి దర్శనం అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి వారి దర్శననికి వచ్చిన భక్తలకు అన్ని రకాల వసతులు ఆలయ అధికారులు కల్పించారు.దర్శన భాగ్యం ఉదయం 5 నుంచి సాయంత్రం 8 గంటల వరకు ఉండటం వల్ల అధిక సంఖ్యలో భక్తులు దర్శన భాగ్యం చేసుకున్నారు. భక్తులు దేవుని దర్శనం చేసుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ సహాయ కమిషనర్ ఈఓ వాణి, భక్తులకు అన్ని వసతులు కల్పించరు.



## జగనన్న క్రీడా సంబరాలలో 64 మంది ఎంపిక...ఎంపీడీఓ




ఆత్మకూరు....నెల్లూరు జిల్లా ఆత్మకూరు నియజకవర్గ స్థాయి జగనన్న క్రీడా సంబరాలు బుధవారం నాడు ఆత్మకూరు ప్రభుత్వ హైస్కూల్ లో జరిగిన పోటీలలో 64 మంది ఎంపిక అయినారని ఎంపిడిఓ సి. శ్రీనివాసులు తెలియజేశారు. ఈ రోజు వాలీబాల్, కబడి పోటీలు యువతీ యవకులకు క్రికెట్ పోటీల్లో యువకులు మాత్రమే పాల్గొన్నారు. ఈ రోజు ఉదయం జరిగిన పోటీలు ఎంపీడీఓ సి. శ్రీనివాసులు, విద్యాశాఖ అధికారి షేక్ నజీర్ బాషా హైస్కూల్ ప్రధనోపాద్యా యులు శేషాద్రి వాసు, ఆత్మకూరు మునిసిపాలిటీ వైస్ చైర్మన్ శ్రావణ కుమార్, వార్డు కౌన్సిలర్ సనా భాస్కర్ రెడ్డి లు ప్రారంభం చేశారు. సాయంత్రం పోటీల్లో పాల్గొని గెలుపొందిన వారిలో 40 మంది యువకులను 24 మంది మహిళలు జిల్లా పోటీలకు ఎంపిక చేయబడ్డారు. వీరిని గౌరవ ఆత్మకూరు శాసనసభ్యులు తన స్వంత ఖర్చులతో పోటీలు జరిపి జిల్లా పోటీలకు పంపుతున్నారని ఎంపీడీఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో పి.తిరుపతయ్య, సిహెచ్ మోహన్,షేక్.షరీఫ్, కే.మధు సుధన్, పి.హరికృష్ణ, పి.మురళి, కె. వెంకట కృష్ణ వ్యాయామ ఉపాధ్యాయుల అధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహించారు

## కుటుంబ జీవనాధారం కొరకు కుట్టు మిషన్ అందజేసిన ఎమ్మెల్యే



తుగ్గలి: కుటుంబ యజమాని చనిపోవడంతో జీవనాధారం కొరకు ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబానికి ఎమ్మెల్యే శ్రీదేవి కుట్టు మిషన్ ను అందజేశారు.మండల పరిధిలోని గల ఎర్రగుడి గ్రామంలో గత నెలలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ఎస్సీ కాలనీలో పర్యటించారు.ఈ పర్యటనలో భాగంగా ఎస్సీ కాలనీకు చెందిన జమున అనే మహిళ తన భర్త చనిపోవడంతో తన ముగ్గురు పిల్లల పోషణకు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నామని బాధితురాలు ఎమ్మెల్యేకు తెలియజేశారు.పిల్లల పోషణ కొరకు స్వయం ఉపాధి పొందడానికి కుట్టు మిషన్ మంజూరు చేయాలని ఎమ్మెల్యే కు బాధితురాలు విజ్ఞప్తి చేశారు.బాధితురాల ఆవేదనతో ఎమ్మెల్యే శ్రీదేవి బుధవారం రోజున గ్రామ నాయకుల చేతుల మీదుగా పత్తికొండ వైఎస్ఆర్ పార్టీ కార్యాలయంలో కుట్టు మిషన్ ను అందజేశారు.తన ఆవేదనను అర్థం చేసుకొని తమ సమస్యను పరిష్కరించడానికి కృషి చేసిన ఎమ్మెల్యేకు బాధితురాలు జమున కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జడ్పిటిసి పులికొండ నాయక్,మండల కన్వీనర్ జిట్టా నాగేష్,వైస్ ఎంపీపీ మల్లికార్జునెడ్డి,వైసీపీ నాయకులు ఎర్రగుడి రామచంద్రా రెడ్డి, పగిడిరాయి జగన్నాథ రెడ్డి,తుగ్గలి మోహన్ రెడ్డి, కడముకుంట్ల అమర్నాథ్ రెడ్డి,రాతన ఉమన్న మరియు బాధితురాలు జమున తదితరులు పాల్గొన్నారు

## నేషనల్ సాఫ్ట్ బాల్ ఛాంపియన్ షిప్ లోగో ఆవిష్కరణ

### జాతీయ స్థాయి సాఫ్ట్ బాల్ క్రీడలను విజయవంతం చేయండి శాప్ ఛైర్మన్ బైరెడ్డి సిద్దార్థ రెడ్డి





నందికొట్కూర్. నవంబర్ 23కర్నూలు నగరంలో ఏ క్యాంప్ మాంటిస్సోరి పాఠశాలలో ఈ నెల 25 నుండి 29 వరకు ఐదు రోజులపాటు ప్రతిష్టాత్మకంగా నిర్వహించబోతున్న 35వ సబ్ జూనియర్ జాతీయ సాఫ్ట్ బాల్ ఛాంపియన్షిప్ కార్యక్రమం బుధవారం శాప్ చైర్మన్, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి స్వగృహంలో కలిసి నిర్వాహక కమిటీ సభ్యులు ఆహ్వానించడం జరిగింది.తదుపరి నేషనల్ సాఫ్ట్ బాల్ ఛాంపియన్షిప్ “లోగో” ను శాప్ చైర్మన్ గారి చేతుల మీదుగా ఆవిష్కరింప చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో కర్నూలు డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ సీఈవో వెంకటరమణ గారు చీఫ్ కోచ్ నటరాజ్ గారు,సాఫ్ట్ బాల్ అసోసియేషన్ కర్నూలు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చంద్రశేఖర్, విజయ్ కుమార్ , సలహాదారు జకీర్ హుస్సేన్, స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కర్నూలు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్రీనాథ్ పెరుమాళ్ళ, పుల్లన్న ముప్పసాని మరియు ఫిజికల్ డైరెక్టర్లు శేఖర్, తిప్పన్న, సుంకన్న, శ్రీనివాసులు, కుమార్, మల్లి, చాణిక్యదాసు, డీ. యస్.ఏ.సీనియర్ అసిస్టెంట్ శేష ఫణి, సీనియర్ సాఫ్ట్ బాల్ క్రీడాకారుల తదితరులు పాల్గొన్నారు.


## జనసేన మహిళల నిరసన

విశాఖపట్నం ముఖ్య మంత్రి జగన్ మోహన్ రెడ్డి నర్సాపురం సభ లో మహిళల చున్నిలని తీయించడాన్ని జనసెన వీర మహిళలు తీవ్రంగా ఖండించారు. విశాఖ జీ వీ ఎం సీ గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. గాంధీ విగ్రహనికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. మహిళ లు కు ఇంత అవమానం మహిళ కమిషన్, మహిళ మంత్రులు ఏమీ చేస్తున్నారని ప్రశ్నించారు.

## శ్రీ శ్రీ నరసింహ స్వామి రాజ గోపుర నిర్మాణం కు విరాళాలు

కౌతాళం : మండల పరిధిలో ఉరుకుంద గ్రామంలో వెలసిన పుణ్యక్షేత్రం ఉరుకుంద శ్రీ నరసింహ స్వామి పుణ్యక్షేత్రం .భక్తుల పాలిటి కల్పవృక్షమై భక్తుల కోరికలను తీర్చే ఆరాధ్యదైవం గా నరసింహ స్వామి కొలుస్తారు. సోమవారం శ్రీ నరసింహ స్వామి పుణ్యక్షేత్రం కు ఆదోని గ్రామ వాస్తవ్యులు కోటినేని లక్ష్మమ్మ, నాగరాజు, మరియు జి సి రంగన్న మరియు వారి కుటుంబ సభ్యులు శ్రీ నరసింహస్వామి దైవ దర్శనం చేసుకున్నారు. అనంతరం వారు ఆలయ అధికారులకు రాజగోపురం నకు 1,01,116 రూ విరాళలు అందజేశారు. దేవస్థానం తరపున ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేసి ఫల ప్రసాదాలను అందజేశారు. వారిని శాలువా కప్పి పూలమాలలతో సత్కరించారు.వారు మాట్లాడుతూ మొక్కుబడిగా మొక్కులు తీర్చుకున్నామని తెలిపారు.

## ‘18 పేజెస్’ నుండి ‘నన్నయ్య రాసిన’ సోల్ ఫుల్ క్లాసీ మెలోడీ..!




యంగ్ హీరో నిఖిల్ సిద్దార్థ మరియు అందాల భామ అనుపమ పరమేశ్వరన్ జంటగా నటిస్తున్న తాజా చిత్రం ”18 పేజెస్”. స్టార్ డైరెక్టర్ సుకుమార్ కథ అందించిన ఈ సినిమాకి ఆయన శిష్యుడు పల్నాటి సూర్య ప్రతాప్ స్క్రీన్ ప్లే - దర్శకత్వ బాధ్యతలు నిర్వహించారు. వరుస హిట్ సినిమాలను నిర్మిస్తున్న జీఏ2 పిక్చర్స్ బ్యానర్ లో ఈ చిత్రం తెరకెక్కుతోంది.ఇదివరకే రిలీజైన ఈ సినిమా ఫస్ట్ లుక్ - స్పెషల్ పోస్టర్స్ మరియు గ్లిమ్స్ కు ఆడియన్స్ నుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది. అలానే చిత్ర టీజర్ సినిమాపై ఆసక్తిని కలిగించింది. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్ లో భాగంగా తాజాగా ‘18 పేజెస్’ చిత్రం నుండి ‘నన్నయ్య రాసిన’ అనే ఫస్ట్ సింగిల్ లిరికల్ వీడియోని మేకర్స్ విడుదల చేసారు.’ఏ కన్నుకి ఏ స్వప్నమో.. ఏ రెప్పలైనా తెలిపేనా.. ఏ నడకది ఏ పయనమో.. ఏ పాదమైనా చూపేనా.. నీలో స్వరాలకే నేనే సంగీతమై.. నువ్వే వదిలేసిన పాటై సాగనా..’ అంటూ సాగిన ఈ గీతం శ్రోతలను విశేషంగా ఆకట్టుకుంటోంది. దీనికి మ్యూజిక్ డైరెక్టర్ గోపి సుందర్ తనదైన శైలిలో మంచి మ్యూజికల్ మెలోడియస్ ట్యూన్ ని కంపోజ్ చేసారు.’నన్నయ్య రాసిన కావ్యమాగితే.. తిక్కన తీర్చేనుగా.. రాధమ్మ ఆపిన పాట మధురిమ.. కృష్ణుడు పాడెనుగా’ అంటూ గీత రచయిత శ్రీమణి రాసిన సాహిత్యం మంచి ఫీల్ ను కలిగిస్తోంది. గాయనీ గాయకులు సితార కృష్ణ కుమార్ - పృథ్వీ చంద్ర తమ వాయిస్ తో మరింత శ్రావ్యతను జోడించారు.’నన్నయ్య రాసిన’ పాట నేపథ్యం అంతా రైటింగ్ గురించి వివరిస్తూ సాగింది. ఇందులో వేర్వేరు చోట్ల హీరో హీరోయిన్లు తమ భావాలను పంచుకుంటున్నారు. నిఖిల్ మరియు అనుపమ ఎంతో అందంగా కనిపిస్తున్నారు. ఈ పాట వినసొంపుగా ఉండటమే కాదు.. విజువల్ గానూ బాగుంది.ఈ పాట ఖచ్చితంగా ఇన్స్టంట్ మెలోడీ హిట్ గా నిలుస్తుందనిపిస్తోంది. ప్రేమ్ రక్షిత్ మాస్టర్ దీనికి కొరియోగ్రఫీ చేసినట్లు తెలుస్తోంది. ఎ వసంత్ సినిమాటోగ్రఫీ నిర్వహించగా.. రమణ వంక ఆర్ట్ డైరెక్టర్ గా వర్క్ చేసారు. నవీన్ నూలి ఎడిటింగ్ చేస్తున్నారు. శరణ్ రాపర్తి - అశోక్ బండ్రెడ్డి ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. మెగా ప్రొడ్యూసర్ అల్లు అరవింద్ సమర్పణలో సుకుమార్ రైటింగ్స్ తో కలిసి బన్నీ వాసు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ‘కార్తికేయ-2’ వంటి ఎపిక్ బ్లాక్ బస్టర్ తర్వాత నిఖిల్ సిద్దార్థ్ మరియు అనుపమ పరమేశ్వర్ కలిసి నటించిన సినిమా కావడంతో ‘18 పేజెస్’ పై మంచి అంచనాలు నెలకొన్నాయి.”18 పేజెస్” చిత్రాన్ని క్రిస్మస్ స్పెషల్ గా డిసెంబర్ 23న ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రమోషనల్ కంటెంట్ తో ఆసక్తిని రెట్టింపు చేస్తున్నారు. మరి ఈ నాస్టాల్జిక్ రొమాంటిక్ ఎంటర్టైనింగ్ సినిమా బాక్సాఫీస్ వద్ద ఎలాంటి విజయాన్ని సాధిస్తుందో చూడాలి.

## బుచ్చికి ఈసారైనా వెయిటింగ్ టైం తగ్గుతుందా..?

స్టార్ డైరెక్టర్ సుకుమార్ ప్రియ శిష్యులు ఒకరి తర్వాత మరొకరు దర్శకులుగా ఇండస్ట్రీకి పరిచయం అవుతున్నారు. అందులో బుచ్చిబాబు సానా ఒకరు. మెగా మేనల్లుడిని హీరోగా లాంచ్ చేస్తూ.. “ఉప్పెన” వంటి బ్లాక్ బస్టర్ సినిమా అందుకున్నాడు.తొలి సినిమానే బాక్సాఫీస్ వద్ద ఘన విజయం సాధించడంతో.. బుచ్చిబాబు ఒక్కసారిగా క్రేజీ డైరెక్టర్ గా మారిపోయాడు. పెద్ద పెద్ద బ్యానర్స్ నుంచి పిలుపు వచ్చింది. అయితే దర్శకుడు మాత్రం మైత్రీ మూవీ మేకర్స్ లోనే మరో సినిమా చేయడానికి కమిట్ అయ్యాడు.వచ్చే ఫిబ్రవరికి ‘ఉప్పెన’ సినిమా విడుదలై రెండేళ్లు పూర్తి అవుతుంది. కానీ ఇంత వరకూ బుచ్చి బాబు తన రెండో ప్రాజెక్ట్ ని పట్టా లెక్కించలేకపోయాడు. కనీసం అధికారిక ప్రకటన కూడా లేదు. దీనికి కారణం దర్శకుడు కేవలం స్టార్ హీరోలతోనే తదుపరి సినిమా చేయాలని కూర్చోవడమే అని తెలుస్తోంది.నిజానికి బుచ్చి టాలీవుడ్ స్టార్ హీరోల్లో ఒకరైన ఎన్టీఆర్ మూవీ చేయడానికి చాలా ప్రయత్నాలు చేశాడు. ‘నాన్నకు ప్రేమతో’ టైంలో ఏర్పడిన పరిచయంతో యంగ్ టైగర్ కు ఓ కథ కూడా నేరేట్ చేసాడు. బేసిక్ స్టోరీ లైన్ నచ్చడంతో ఫుల్ స్క్రిప్ట్ రెడీ చేసుకొని రమ్మని బుచ్చికి చెప్పినట్లుగా చాలా నెలల క్రితమే వార్తలు వచ్చాయి.బుచ్చిబాబు రెడీ చేసిన సెకండాఫ్ పై సంతృప్తి చెందని తారక్.. ఆ స్క్రిప్ట్ ని తిరస్కరించాడని ఇటీవల రూమర్స్ వినిపించాయి. కొరటాల శివ సినిమా ఆలస్యం అవడంతో బుచ్చిబాబుని మరో సినిమా చేసుకొని రావాల్సిందిగా ఎన్టీఆర్ సూచించారని కూడా టాక్ వుంది.ఎలా అయితేనేం ఎన్టీఆర్ తోనే సినిమా చేయాలని ఇన్నాళ్లూ వేచి చూసిన బుచ్చి.. అన్ని ప్రయత్నాలు విఫలం అవ్వడంతో ఇంకో హీరో కోసం అన్వేషణ మొదలు పెట్టారని తెలుస్తోంది. ఈ క్రమంలో ఈసారి దర్శకుడు మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ చెంతకు చేరాడని వార్తలు వినిపించాయి.అయితే ఇప్పుడు చివరకి అదే ఫైనల్ అయినట్లుగా టాక్ నడుస్తోంది.



బుచ్చి బాబు ఇప్పటి వరకూ తారక్ తో చెయ్యాలని చూసిన కథనే ఇప్పుడు చరణ్ కి చెప్పి ఒప్పించాడట. దీంతో చెర్రీ హీరోగా ఉప్పెన డైరెక్టర్ రెండో ప్రాజెక్ట్ సెట్ అయినట్లే అని అంటున్నారు. కాకపోతే ఈ ప్రాజెక్ట్ ని మైత్రీ మేకర్స్ కాకుండా.. ఓ కొత్త బ్యానర్ లో రూపొందిస్తారని టాక్.రామ్ చరణ్ ప్రస్తుతం సౌత్ స్టార్ డైరెక్టర్ శంకర్ తో ఆర్సీ15 వంటి భారీ ప్రాజెక్ట్ చేస్తున్నారు. ప్రస్తుతం సెట్స్ మీదున్న ఈ సినిమా వచ్చే ఏడాది రావడం కష్టంగానే కనిపిస్తోంది. ‘ఇండియన్ 2’ వచ్చే దసరా కు ప్లాన్ చేస్తే.. చెర్రీ పాన్ ఇండియా చిత్రాన్ని 2024 సంక్రాంతికి తీసుకొచ్చే అవకాశం ఉంది.గౌతమ్ తిన్ననూరి ప్రాజెక్ట్ క్యాన్సిల్ అయింది కాబట్టి.. బుచ్చిబాబు తోనే ఆర్సీ16 చిత్రం వుంటుందని అనుకోవచ్చు. కాకపోతే ఇప్పుడప్పుడే సెట్స్ మీదకు రాకపోవచ్చు. చరణ్ కి తగ్గట్టుగా బుచ్చి స్క్రిప్ట్ మీద కొంచం వర్క్ చేయాల్సి ఉంటుంది. వచ్చే ఏడాది షూటింగ్ మొదలు పెట్టినా సినిమా పూర్తవ్వడానికి చాలా సమయమే పడుతుంది.దీన్ని బట్టి బుచ్చి రెండో చిత్రం రావడానికి మరో రెండేళ్లు పట్టొచ్చు. ఈ గ్యాప్ లో రామ్ చరణ్ మరో దర్శకుడు చెప్పిన కథకి గ్రీన్ సిగ్నల్ ఇస్తే బుచ్చిబాబు ప్రాజెక్ట్ నెంబర్ మారుతుంది. అప్పుడు ఎన్టీఆర్ కోసం వెయిట్ చేసినట్లుగా.. చెర్రీ కోసం కూడా వేచి చూసే పరిస్థితి వస్తుంది. అగ్ర హీరోలతో వర్క్ చేయాలని కూర్చుంటే ఆ మాత్రం వెయిటింగ్ తప్పదని ఇండస్ట్రీలో కామెంట్స్ వినిపిస్తున్నాయి.

## కంగన లా ఫేమస్ అవ్వాలన్నది తాప్సీ ప్లాన్!

బాలీవుడ్ కి వెళ్లిన దగ్గర నుంచి తాప్సీ లో ఛేంజోవర్ చూస్తూనే ఉన్నాం. టాలీవుడ్ లో ఉన్నంత కాలం కామ్ గోయింగ్ గాళ్ గా వెళ్లిపోయింది. వచ్చిన అవకాశాలు సద్వినియోగం చేసుకుంటూ సినిమాలు తప్ప మరో ధ్యాస లేకుండా ముందుకు సాగింది. కానీ హిందీ కెళ్లిన తర్వాత మొత్తం విధానమే మార్చేసింది. ముందుగా తనలో డేరింగ్ నెస్ ని బయట పెట్టింది.ఏ విషయంపైనైనా కంగన తరహాలో ముక్కు సూటిగా మాట్లాడటం అలవర్చుకుంది.



వివాదాల తలెత్తితే తనదైన శైలిలో స్పందించడం నేర్చుకుంది. ఎవరైనా వ్యక్తిగతంగా టార్గెట్ చేస్తూ కౌంటర్లు వేదయం ప్రారంభించింది. ఇలా ఒకటేంటి? చాలా విషయాల్లో మార్పులు తీసుకొచ్చింది తాప్సీ. ఇలా ప్రతీ విషయంలో కంగనకు మ్యాచ్ అయింది.ఇటీవలే ఓ స్టార్ హీరోయిన్ సైతం తాప్సీని కంగనలా మరో ఫైర్ బ్రాండ్ దిగిందంటూ ఆకాశానికి ఎత్తేసింది. కొన్ని విషయాల్లో తనకి -తాప్సీ కి పడకపోయినా తనలో డేరింగ్ నెస్ కి ఫిదా అయ్యానంటూ సదరు హీరోయిన్ రివీల్ చేసింది. మరి కంగన లా తాప్సీ నటిగా కూడా అంతే కమిట్ మెంట్ తో కెరీర్ ని ప్లాన్ చేసుకుంటుందా? సోలోగానే ఇమేజ్ ని రెట్టింపు చేసుకునే ప్లాన్ లోఉందా? అంటే అవుననే తెలుస్తోందిాప్సీ నటిగా కొనసాగుతూనే ఇటీవల నిర్మాతగాను పరిచయమైన సంగతి తెలిసిందే. తన నిర్మాణ సంస్థలో లేడీ ఓరియేంటెడ్ సినిమాలు చేసి హీరోయిన్లు..హీరోలకి ఏమాత్రం తీసిపోరని చాటి చెప్పాలన్నది అమ్మడి ప్లాన్ గా వైరల్ అయింది. దీనికి తగ్గట్టు సదరు బ్యానర్లో సమంతతో ఓ లేడీ ఓరియేంటెడ్ సినిమా నిర్మిస్తున్నట్లు ప్రచారం సాగింది.ఇక హీరోయిన్ గా కంగనలా వెలిగిపోవాలని తాప్సీ ముఖ్య ఉద్దేశం. దీనిలో భాగంగా విదేశీ సినిమా రీమేక్ ల్లోనటిస్తోంది. ఆ మధ్య ‘బద్లా’ అనే ఓ సినిమాలో నటించింది. ఇది ఓ స్పానిష్ సినిమాకి రీమేక్. తాజాగా ‘బ్లర్’ అనే సినిమా చేస్తుంది.అక్కా చెల్లెళ్ల నేపథ్యంలో సాగే థ్రిల్లర్ చిత్రమిది. ఇది కూడా మరో స్పానిష్ సినిమా రీమేక్ అని తెలుస్తోంది. సొంత కంటెంట్ కంటే విదేశీ హిట్ సినిమాల్ని తీసుకుంటే సక్సెస్ ఈజీ అవుతోంది అన్న కోణంలో తాప్సీ ఇలా ముందుకు సాగుతోంది. బ్యాక్ టూ బ్యాక్ లేడీ ఓరియేంటెడ్ చిత్రాలతోనే మార్కెట్ ని బిల్డ్ చేసుకోవాలన్నది తాప్సీ మెయిన్ ప్లాన్ గా తెలుస్తోంది.

## ఎవరేమనుకున్నా పట్టించుకోను.. సంజూ వివాదంపై హార్దిక్ పాండ్యా కౌంటర్



దిల్లీ: న్యూజిలాండ్‌తో టీ20 మ్యాచుల్లో తుది జట్టులోకి ఉమ్రాన్ మాలిక్, సంజూ శాంసన్ వంటి ఆటగాళ్లను తీసుకోకపోవడంపై పలువురు టీమ్ మేనేజ్‌మెంట్, కెప్టెన్‌ను లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పిస్తున్నారు.ఈ అంశంపై కెప్టెన్ హార్దిక్ పాండ్యా స్పందించాడు. పొట్టి సిరీస్‌లో ఆటగాళ్లను మార్చడం వల్ల ప్రయోజనం ఉంటుందని తాను అనుకోవడం లేదని తెలిపాడు. ఇలాంటి విమర్శలు తనను బాధించవన్నాడు.’ఇది నా జట్టు. జట్టుకు సరిపోయే ఆటగాళ్లను కోచ్‌తో కలిసి నేను ఎంపికచేసుకుంటాను. ఇంకా చాలా సమయం ఉంది. ప్రతి ఒక్కరికీ అవకాశం ఉంటుంది. ఒకసారి జట్టులోకి వస్తే వారు ఎక్కువ కాలం పాటు కొనసాగుతారు. ఇక దీని గురించి బయట నుంచి వచ్చే విమర్శలను నేను పట్టించుకోను. ఒకవేళ ఇది ఎక్కు వ మ్యాచ్‌లు ఆడే సుదీర్ఘ సిరీస్ అయితే.. కచ్చితంగా అందరినీ ఆడిస్తాం. అంతేకానీ జట్టును మధ్యలో విభజించి మార్పులు చేయడం సరైందని నేను నమ్మను. భవిష్యత్తులో కూడా నా పద్ధతి ఇలాగే ఉంటుంది” అంటూ హార్దిక్ వివరించాడు. అదే సమయంలో సంజూ శాంసన్ అంశంపైకూడా స్పందించాడు.”ఉదాహరణకు సంజూనే తీసుకోండి.. మేం అతడిని జట్టులోకి తీసుకోవాలనుకున్నాం. కానీ కొన్ని కారణాల వల్ల అది కుదరలేదు. నేను వారి స్థానంలో ఉండి ఆలోచించగలను. టీమ్‌ఇండియాలో కొనసాగుతూ 11 మంది ఆటగాళ్లలో ఒకరిగా లేకపోవడం ఎంత బాధ కలిగిస్తుందో నాకు తెలుసు. కానీ నేను కెప్టెన్‌గా ఉంటే మాత్రం ఆ పరిస్థితులను చక్కదిద్దే ప్రయత్నం చేస్తాను. వారు నాతో, కోచ్‌తో మాట్లాడితే నేను వారికి సర్దిచెప్పగలను. ఎందుకంటే నాది జట్టును కలిసికట్టుగా ఉంచగలిగే స్వభావం” అంటూ పాండ్యా వివరించాడు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**